# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 217 | విశాఖపట్నం | 8-5-2026 శుక్రవారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 217 | VISAKHAPATNAM | 8-5-2026 FRIDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-



SBI
PATHAKAM NEWS
SCAN & PAY
UPI ID: 44576280686@sbi
BHIM | UPI
yono SBI | BHIM SBI Pay
G Pay | Paytm | PhonePe



Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram




## తమిళనాడులో రాజకీయ ఉత్కంఠ?

- టీవీకే ఎమ్మెల్యేలతో అధినేత విజయ్ సమావేశం
- గవర్నర్ వైఖరిపై కాంగ్రెస్ ఫైర్
- ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేసిన విజయ్
- మెజార్టీకి 5 సీట్ల దూరంలో..
- టీవీకే పార్టీకి మద్దతు ఇస్తామంటున్న చిన్న పార్టీలు

2లో



3లో

## కంబాలకొండలో కొత్త సొగసులు

### రాత్రి బస కోసం కాటేజీల నిర్మాణం



2లో

### రైతుల ఆవేదన కనపడలేదా: జోగి రమేష్



6లో

### దంత సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలి?

## బెంచ్ మార్క్ సెట్ చేసేలా ఏపీ అభివృద్ధి చెందాలి

### జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్సులో చంద్రబాబు దిశానిర్దేశం



**అమరావతి, పతాకం న్యూస్:** సంక్షేమం, అభివృద్ధి, సంపద సృష్టి .. ఈ మూడూ ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయని, ఈ W-D-WC సైకిల్‌ను వేగంగా ముందుకు తీసుకెళ్లడం ద్వారానే రాష్ట్రాన్ని దేశంలో అగ్రగామిగా నిలపగలమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పాలనలో వేగం పెంచి, అభివృద్ధిలో సరికొత్త బెంచ్‌మార్క్‌ను సెట్ చేయాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. అమరావతి సచివాలయంలో గురువారం ప్రారంభమైన రెండు రోజుల 7వ జిల్లా కలెక్టర్ల సదస్సులో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర భవిష్యత్ ప్రగతికి స్పష్టమైన మార్గసూచీని ఆవిష్కరించారు. గత ప్రభుత్వ వైఫల్యాలను ప్రస్తావిస్తూ, "గత పాలకుల నుంచి రూ.9.74 లక్షల కోట్ల అప్పులు, రూ.1.30 లక్షల కోట్ల పెండింగ్ బిల్లులు మనకు (తరువాయి 2వ పేజీలో)



## ఏళ్ల నాటి సమస్య.. పరిష్కారమయ్యేనా?

5లో


పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

ధర్మం కోసం
పోరాటం చేస్తున్నా..
అవినీతి, అక్రమాలను
బయటకు తీస్తున్నా..
పతాకం న్యూస్‌కు
సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH


## పిఠాపురం టీడీపీలో అనూహ్య పరిణామం..

### బాధ్యతల నుంచి వర్మ తొలగింపు..



**పిఠాపురం, పతాకం న్యూస్:** పిఠాపురం నియోజకవర్గంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జ్‌గా వ్యవహరిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మను ఆ బాధ్యతల నుంచి అధిష్ఠానం తప్పించింది. ఈ నిర్ణయం స్థానిక రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పార్టీ వ్యవహారాలను పర్యవేక్షించేందుకు త్వరలోనే ఒక ప్రత్యేక కమిటీని నియమించనున్నట్లు తెలుస్తోంది. ఈ కమిటీ ఏర్పాటుపై టీడీపీ అధిష్ఠానం కసరత్తు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే వర్మ పిఠాపురంలోని పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆయన తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు.

### భూ వివాదాల్లేని రాష్ట్రంగా ఏపీని

## తయారు చేస్తాం: అనగాని



**అమరావతి, పతాకం న్యూస్:** బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును సాధించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంత్రి అనగాని సత్యప్రసాద్ అభినందనలు తెలియజేశారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలో జరుగుతున్న 7వ కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో మంత్రి ప్రసంగిస్తూ.. రాష్ట్రాన్ని గత పాలకులు విధ్వంసం చేసినా.. పునర్నిర్మించుకుంటున్నామని తెలిపారు. భూ సంబంధిత అంశాల్లో సంస్కరణలు తీసుకువచ్చామని.. అడంగళ్లు, పాస్ పుస్తకాలు వేగంగా అందిస్తున్నామని చెప్పారు. 1.37 లక్షల ఎకరాలు 22ఏ నుంచి తొలగించామని మంత్రి వివరించారు. రిజిస్ట్రేషన్ శాఖను సిటిజెన్ ఫ్రెండ్లీగా తయారు చేస్తున్నామని మంత్రి తెలిపారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ సర్వీసులు ఒకటే ప్లాట్ ఫాంపైకి తీసుకురావాలని నిర్ణయించామన్నారు. డిజిటలైజేషన్ ప్రక్రియను వేగంగా చేపడుతున్నామని చెప్పారు. రీసర్వే ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి భూ వివాదాల్లేని రాష్ట్రంగా ఏపీని తయారు చేస్తామని వెల్లడించారు. రాష్ట్రం నుంచి సింగపూర్ దేశానికి అధ్యయనం కోసం వెళ్లామని.. పాలనాపరమైన అంశాలను చాలా నేర్చుకున్నామని అన్నారు. సింగపూర్ దేశంలో ప్రెసిషన్, ఇంటిగ్రేషన్, సైన్స్‌ను పాలనలో ఇంటిగ్రేట్ చేశారన్నారు. గవర్నెన్సు అంటే టీమ్ వర్క్‌గా పని చేస్తున్న విధానం సింగపూర్‌లో ఉందని... ఏపీలోనూ ఇదే అంశాన్ని సీఎం పదేపదే చెబుతున్నారని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.

## సాయుధ దళాలపై మోడీ ప్రశంసలు..



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత ప్రభుత్వం 'ఆపరేషన్ సిందూర్' చేపట్టిన సంగతి తెలిసిందే. 2025, మే 7వ తేదీన భారత వైమానిక దళాలు పాకిస్థాన్‌తో పాటు పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేశాయి. ఈ దాడుల్లో ఉగ్రవాద స్థావరాలు ధ్వంసం అయ్యాయి. 100 మంది దాకా ఉగ్రవాదులు చనిపోయారు. గురువారం ఆపరేషన్ సిందూర్‌కు ఏడాది పూర్తయింది. ఈ సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ తన ఎక్స్ ఖాతాకు సంబంధించిన డీపీని మార్చారు. ఆపరేషన్ సిందూర్ ఫొటో పెట్టారు. సాయుధ దళాలపై ప్రశంసలు కురిపిస్తూ ఓ పోస్టు పెట్టారు.

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## 'స్ఫూర్తి టాగూర్

భారతదేశానికి జాతీయ గీతాన్ని అందించిన ప్రసిద్ధ కవి, బహుముఖ ప్రజ్ఞాశాలి రవీంద్రనాథ్ టాగూర్. 'గీతాంజలి' కావ్యానికి 1913లో సాహిత్యంలో నోబెల్ బహుమతి పొందిన తొలి ఆసియావాసిగా రవీంద్రుడు ఖ్యాతి పొందారు. కవి, నవలాకర్త, రచయిత, నాటకకర్త, వ్యాసకర్త, కథా రచయిత, సంగీత కర్త, తత్వవేత్త, సంఘ సంస్కర్త, విద్యావేత్త, భాషావేత్త, వ్యాకరణ పండితుడు, చిత్రకారుడు అయిన రవీంద్రనాథ్ టాగూర్ 1861 మే 7న దేవేంద్రనాథ టాగూర్ -- శారదా దేవి దంపతులకు జన్మించారు. బాల్యంలో ఇంటి నాలుగు గోడల మధ్య గడిపిన టాగూర్‌కు బయటి ప్రపంచం అద్భుతంగా తోచేది. పాఠశాలకు వెళ్లడం ఇష్టపడక...ఇంటి దగ్గరే క్రమశిక్షణతో వ్యాయామం, గణితం, చరిత్ర, భూగోళ పాఠాలు, చిత్రలేఖనం, ఆటలు, ఆంగ్లం, సంగీతం, భౌతిక శాస్త్రం, సంస్కృతి వ్యాకరణం, ఆంగ్ల సాహిత్యం చదవడం, మాతృభాషపై పట్టు సాధించడం వంటివి చేసేవారు. రవీంద్రనాథ్ టాగూర్ ఇంగ్లాండ్ వెళ్లి పబ్లిక్ స్కూళ్లలో చేరి ఆంగ్ల సాహిత్యంపై మక్కువ పెంచుకున్నారు. అక్కడ ఉండగానే భగ్న హృదయం' అనే కావ్యాన్ని రచించారు. ఇంగ్లాండ్‌లో ఏడాదిన్నర పాటు ఉన్నప్పటికీ ఎలాంటి డిగ్రీ పొందకుండానే మాతృభూమికి తిరిగి వచ్చారు. 1883లో మృణాళినీ దేవిని వివాహమాడిన టాగూర్...బాల్యంలోనే పలు పద్యాలు, వ్యాసాలు, విమర్శలు రచించి ప్రచురించారు. రవీంద్రనాథ్ టాగూర్ బెంగాలీలో రచించిన 'గీతాంజలి' నోబెల్ పురస్కారం పొందిన తొలి భారతీయ రచనగా నిలిచింది. 1901లో బాలల మనో వికాసం కోరిన టాగూర్ ఆ దిశగా ఐదుగురు విద్యార్థులతో "శాంతినికేతన్ విశ్వభారతి గురుకుల విశ్వవిద్యాలయాన్ని" స్థాపించారు. అదే క్రమంలో 1919లో కళా భవన్ స్థాపించి విభిన్న కళలను నేర్పించడంతో పాటుగా తానూ స్వయంగా నేర్చుకున్నారు. 'ప్రతిభ', 'ప్రకృతి -- వికృతి' లాంటి పలు నాటకాలు రచించారు. అదే విధంగా 'గోరా' లాంటి ప్రఖ్యాత నవలలు రచిస్తూనే చిత్రకళ, సంగీత శాస్త్రంలో సాధన చేశారు. చిన్ననాటి నుంచే జాతీయ భావాలను పుణికిపుచ్చుకున్న టాగూర్ దేశభక్తి గీతాలను ఆలపించేందుకు ఇష్టపడేవారు. 1896లో జరిగిన కలకత్తా కాంగ్రెస్ సదస్సులో తొలిసారి బంకించంద్ర చటర్జీ రచించిన 'వందేమాతరం' గీతాన్ని ఆలపించారు. 1950 జనవరి 24న భారత రాజ్యాంగ సభ కమిటీ...టాగూర్ రచించిన 'జనగణమన'ను జాతీయ గీతంగా, బంకించంద్ర చటర్జీ రచించిన 'వందేమాతరం'ను జాతీయ గేయంగా ప్రకటించింది. దేవుడు రైతు, శ్రామికుడి రూపంలో ఉన్నాడని బోధించిన టాగూర్ సృజనశీల ఆలోచనలు అన్ని కాలాలకు అనువైనవిగా పేరు తెచ్చుకున్నాయి. తన సుదీర్ఘ జీవితంలో రెండు వేలకు పైగా పాటలు రచించారు. అణగారిన వర్గాల పక్షపాతి అయిన టాగూర్ శాంతి, సామరస్యాల వంటి సార్వత్రిక విలువల స్థాపనకు కృషి చేశారు. రెండవ ప్రపంచ యుద్ధం మిగిల్చిన విధ్వంసాలకు చలించిన రవీంద్రనాథ్ టాగూర్ మానసికంగా కుంగిపోయి అనారోగ్యానికి గురయ్యారు. వ్యాధి తీవ్రత పెరగడంతో 1941 ఆగష్టు 7న తుది శ్వాస విడిచారు. మాతృభూమి, మానవ సంబంధాల పట్ల అచంచల విశ్వాసం కలిగిన టాగూర్ కృషి ప్రపంచ సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. "గురుదేవ్, విశ్వకవి"గా పిలుచుకునే రవీంద్రనాథ్ టాగూర్ జాతీయ గీత సృష్టికర్తగా భారతీయుల మదిలో నిలిచిపోయారు. విద్య, కళ, మానవతావాదంపై టాగూర్ ఆలోచనలు... జీవితంలో అర్థాన్ని, సౌందర్యాన్ని అన్వేషిస్తూ...ప్రజల హృదయాల్లో ప్రతిధ్వనిస్తూనే ఉంటాయి.

## తమిళ రాజకీయాల్లో మా పాత్ర లేదు.. బీజేపీ కీలక ప్రకటన



**చెన్నై, పతాకం న్యూస్:** తమిళనాడులో నూతన ప్రభుత్వ ఏర్పాటుపై రాజకీయ ఉత్కంఠ కొనసాగుతోంది. ఎన్నికల్లో అనూహ్య విజయం సాధించిన నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ, ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన పూర్తి మెజారిటీకి దూరంగా నిలిచింది. ఈ రాజకీయ పరిణామాల నేపథ్యంలో తమ ప్రమేయం ఏమీ లేదని బీజేపీ స్పష్టం చేసింది. మొత్తం 234 స్థానాలున్న తమిళనాడు అసెంబ్లీలో ప్రభుత్వ ఏర్పాటుకు 118 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. అయితే, టీవీకే 108 స్థానాలనే గెలుచుకుంది. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీకి చెందిన 5 మంది ఎమ్మెల్యేలు విజయ్‌కు మద్దతు ప్రకటించడంతో ఆ సంఖ్య 113కు చేరింది. మరో ఐదుగురు ఎమ్మెల్యేల మద్దతు కోసం టీవీకే.. వీసీకే, వామపక్షాల వంటి చిన్న పార్టీలతో చర్చలు జరుపుతోంది. ఈ క్రమంలో ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలని కోరుతూ విజయ్ గవర్నర్ ఆర్.వి. ఆర్లేకర్‌ను రెండుసార్లు కలిశారు. అయితే, సంకీర్ణ ప్రభుత్వానికి అవసరమైన పూర్తి మద్దతు ఉందని నిరూపించుకోవాలని గవర్నర్ సూచించినట్లు తెలుస్తోంది. మెజారిటీ లేకుండా ప్రభుత్వాన్ని ఎలా నడుపుతారని, మద్దతిచ్చే ఇతర పార్టీల నుంచి స్పష్టమైన హామీలు ఎక్కడని గవర్నర్ విజయ్‌ను ప్రశ్నించినట్లు సమాచారం. దీనికి సమాధానంగా తాను ఫ్లోర్ టెస్ట్‌కు సిద్ధంగా ఉన్నానని విజయ్ గవర్నర్‌కు చెప్పినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలపై బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నారాయణన్ తిరుపతి పీటీఐ వార్తా సంస్థతో మాట్లాడుతూ... "ఇది మిశ్రమ తీర్పు. టీవీకేకి పూర్తి మెజారిటీ లేదు. వారు తమ మెజారిటీని నిరూపించుకోవాలి. అలా చేస్తే, గవర్నర్ రాజ్యాంగబద్ధంగా వారిని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానిస్తారు. ఇందులో ఎలాంటి గందరగోళం లేదు" అని ఆయన తెలిపారు. విజయ్ బీజేపీని వ్యతిరేకిస్తున్నందుకే ఆయనపై ఒత్తిడి తెస్తున్నారన్న ఆరోపణలను నారాయణన్ తిరుపతి ఖండించారు. "ఇది ప్రజాస్వామ్య దేశం. ఇక్కడ ప్రతీది ప్రజాస్వామ్యబద్ధంగానే జరుగుతుంది. ఇలాంటి ఆరోపణలు కేవలం రాజకీయ వాక్చాతుర్యం మాత్రమే" అని ఆయన స్పష్టం చేశారు. దీంతో మిగిలిన ఎమ్మెల్యేల మద్దతు కూడగట్టడంపైనే విజయ్ ప్రభుత్వ ఏర్పాటు భవిష్యత్తు ఆధారపడి ఉంది.

## తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటులో జాప్యం.. ప్రజలను అవమానించడమే: కమల్ హాసన్




**చెన్నై, పతాకం న్యూస్:** తమిళనాడు రాజకీయాల్లో చోటుచేసుకున్న అనూహ్య పరిణామాలపై మక్కల్ నీది మయ్యం (వీఏవీ) అధినేత కమల్ హాసన్ సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో ఓ పోస్టు చేశారు. ఈ పోస్టు ఇప్పుడు చర్చనీయాంశమైంది. ముఖ్యంగా దళపతి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం సాధించిన విజయంపై కమల్ స్పందించిన తీరు ఆసక్తికరంగా ఉంది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ ప్రతిష్టంభనపై కమల్ హాసన్ ఎక్స్ వేదికగా తన గళాన్ని వినిపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో జరుగుతున్న జాప్యాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. తమిళనాడు రాజకీయ చరిత్రలో ఇది మునుపెన్నడూ లేని అసాధారణ, చారిత్రాత్మక ఫలితమని కమల్ అభివర్ణించారు. టీవీకే ఇంతటి భారీ విజయాన్ని అందుకోవడం సామాన్యమైనది కాదని పేర్కొన్నారు. 108 స్థానాలను గెలుచుకుని అతిపెద్ద పార్టీగా అవతరించిన విజయ్ నేతృత్వంలోని టీవీకేని వెంటనే ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిందిగా గవర్నర్ ఆహ్వానించాలని డిమాండ్ చేశారు. అతిపెద్ద పార్టీగా నిలిచినప్పటికీ ప్రభుత్వ ఏర్పాటులో జాప్యం చేయడం అంటే, ఓటు వేసిన రాష్ట్ర ప్రజలను అవమానించడమేనని ఆయన విమర్శించారు. ఎన్నికైన 233 మంది ప్రతినిధులు ఇంకా ప్రమాణ స్వీకారం చేయలేకపోవడం తమిళనాడు రాష్ట్రానికి అవమానకరమని, ఇది రాజ్యాంగ విరుద్ధమని కమల్ హాసన్ గుర్తు చేశారు.

## 27 మంది అధ్యాపకులకు షోకాజ్

**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ఇంటర్ పరీక్షా ఫలితాల్లో ఈ ఏడాది అతి తక్కువ ఉత్తీర్ణత వచ్చిన ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకులపై చర్యలకు ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు రంగం సిద్ధం చేశారు. ఏ సబ్జెక్టుల్లో ఎక్కువ మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారో...ఆయా సబ్జెక్టులు బోధించిన లెక్చరర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నట్టు తెలిసింది. ఇంటర్ సాధారణ కోర్సులతోపాటు ఒకేషనల్ కోర్సులకు సంబంధించి కూడా క్రమశిక్షణ చర్యలు ఉంటాయని చెబుతున్నారు. గత నెలలో ఫలితాలు వెలువడిన తరువాత జిల్లాలో తక్కువ ఫలితాలు వచ్చిన ప్రిన్సిపాళ్ల నుంచి వివరణ తీసుకున్నారు. అయితే సబ్జెక్టుల వారీగా ఉత్తీర్ణతను పరిశీలించిన మీదట 27 మంది అధ్యాపకులకు షోకాజ్ ఇవ్వాలని నిర్ణయించారు. కృష్ణా కళాశాల, ఆనందపురం, మల్కాపురం, పెందుర్తి, భీమిలి జూనియర్ కళాశాలలల్లో నాలుగురేసి అధ్యాపకులకు, మధురవాడ, ఇస్లాంపేట కళాశాలల్లో ముగ్గురేసి చొప్పున, అగనంపూడి కళాశాలలో ఒకరికి షోకాజ్ ఇస్తామని జిల్లా వృత్తివిద్యాశాఖాధికారి ఉమారాణి తెలిపారు.

## తిరుమల లడ్డు వ్యవహారంపై ఏపీ సర్కారు కీలక నిర్ణయం



**తిరుమల, పతాకం న్యూస్:** తిరుమల లడ్డూ తయారీలో నాణ్యతతో పాటు ఇతర వివాదస్పద అంశాలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఈ వ్యవహారంపై విచారణ జరిపిన ఏక సభ్య కమిటీ నివేదికను లోతుగా అధ్యయనం చేసేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన హై లెవెల్ కమిటీని ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీకి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఛైర్మన్‌గా వ్యవహరిస్తుండగా, డీజీపీ, న్యాయ శాఖ కార్యదర్శి సభ్యులుగా ఉన్నారు. నివేదికలోని సాంకేతిక, పరిపాలనాపరమైన, న్యాయపరమైన అంశాలను సమగ్రంగా సమీక్షించి, బాధ్యులపై తీసుకోవాల్సిన చర్యలపై ఈ కమిటీ మార్గదర్శకాలను రూపొందించనుంది. ఈ అత్యున్నత స్థాయి కమిటీ తన నివేదికను వారంలోగా ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశాలు అందాయి. లడ్డూ తయారీలో నిబంధనల ఉల్లంఘన ఎక్కడ జరిగింది, అందుకు గల కారణాలను విశ్లేషించి, దోషులపై కఠిన చర్యలు తీసుకోవడమే ఈ కమిటీ ప్రధాన లక్ష్యం.

## రైతుల ఆవేదన కనపడలేదా: జోగి రమేష్



**మైలవరం, పతాకం న్యూస్:** రైతుల ఆవేదన ఈ కూటమి ప్రభుత్వానికి కనబడలేదా అంటూ మాజీ మంత్రి మైలవరం నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త జోగి రమేష్ ప్రశ్నించారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు నందు అకాల వర్షాలకు రైతులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకొని, మొక్కజొన్న, ధాన్యం రాశులను గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించి వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అన్నదాత కన్నీరు మంచిది కాదని చంద్రబాబు నాయుడు గుర్తుంచుకోవాలని హితవు పలికారు. రైతన్నకు అండగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉంటుందని అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు మాటలు ఏమో కోటలు దాడుతున్నాయని రైతులను మాత్రం పట్టించుకునే నాధుడే లేదని విమర్శించారు. సివిల్ సప్లై, వ్యవసాయ శాఖ మంత్రులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. 20 రోజులుగా మైలవరం మార్కెట్ యార్డ్ లో దిక్కుతోచని స్థితిలో మొక్కజొన్న, వరి రైతులు పంటను కొనే నాథు డు లేకపోవడంతో పడి కాపులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మైలవరం నియోజకవర్గాన్ని కెపి పీకే కలిసి దోచేస్తున్నారని విమర్శించారు. రైతుల సమస్యలను ఎమ్మెల్యేకు పట్టించుకుని తీరిక లేదని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైయస్ఆర్ సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## తమిళనాడు రాజకీయ ఉత్కంఠ?



**చెన్నై, పతాకం న్యూస్:** తమిళనాడులో కొత్త ప్రభుత్వ ఏర్పాటుపై రాజకీయ ఉత్కంఠ కొనసాగుతోంది. తొలి ఎన్నికల్లోనే అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ, ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజారిటీకి కొద్దిదూరంలో టీవీకే (తమిళగ వెట్రి కళగం) నిలిచిపోయింది. ఈ కీలక తరుణంలో పార్టీ అధ్యక్షుడు విజయ్ నేడు పనైయూర్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 234 స్థానాలకు గాను టీవీకే 108 సీట్లు గెలుచుకుని సంచలనం సృష్టించింది. దశాబ్దాలుగా తమిళ రాజకీయాలను శాసిస్తున్న డీఎంకే, అన్నాడీఎంకేల ఆధిపత్యానికి గండికొడుతూ విజయ్ పార్టీ చరిత్రాత్మక విజయం సాధించింది. అయినప్పటికీ ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి అవసరమైన 118 మేజిక్ ఫిగర్‌కు ఇంకా 10 సీట్ల దూరంలో ఉంది. దీంతో ఇతర పార్టీలు, స్వతంత్ర శాసనసభ్యుల మద్దతు కూడగట్టే ప్రయత్నాల్లో టీవీకే నిమగ్నమైంది. గత రెండు రోజులుగా తెరవెనుక మంతనాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేలతో విజయ్ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. మారుతున్న రాజకీయ పరిణామాలు, ఇతర పార్టీలతో జరుపుతున్న చర్చల పురోగతి, ప్రభుత్వ ఏర్పాటుకు ఉన్న అవకాశాలపై ఈ సమావేశంలో విజయ్ ప్రదానంగా చర్చించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ క్లిష్ట సమయంలో ఎమ్మెల్యేలందరూ ఐక్యంగా ఉండాలని, వారికి భరోసా కల్పించేందుకే విజయ్ ఈ సమావేశం నిర్వహిస్తున్నారని సమాచారం. ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియ, రాజ్యాంగపరమైన అంశాలపై కూడా ఆయన ఎమ్మెల్యేలకు వివరించనున్నారు. చర్చలు జరుగుతున్నందున అనవసరమైన బహిరంగ వ్యాఖ్యలు చేయవద్దని, పార్టీ నాయకత్వానికి అందుబాటులో ఉండాలని కూడా విజయ్ సూచించే అవకాశం ఉంది. సంఖ్యాబలంపై స్పష్టత రాకపోవడంతో ఈ వారంలో జరగాల్సిన ప్రమాణ స్వీకారోత్సవంపై నీలినీడలు కమ్ముకున్నాయి. రానున్న 48 గంటలు తమిళ రాజకీయాలకు అత్యంత కీలకమని, విజయ్ ప్రభుత్వ ఏర్పాటులో విజయం సాధిస్తారా? లేదా? ప్రత్యర్థి కూటములు ప్రత్యామ్నాయ వ్యూహాలు రచిస్తాయా? అనేవి తేలిపోతాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ సమావేశం నేపథ్యంలో పనైయూర్‌లోని పార్టీ కార్యాలయం వద్ద భారీగా కార్యకర్తలు చేరుకునే అవకాశం ఉండటంతో పోలీసులు పటిష్ఠ భద్రతా ఏర్పాటు చేశారు.

(మొదటిపేజీ తరువాయి)

## బెంచ్ మార్క్ సెట్ చేసేలా ఏపీ అభివృద్ధి చెందాలి

వారసత్వంగా సంక్రమించాయి. 94 కేంద్ర ప్రాయోజిత పథకాల నుంచి రూ.10 వేల కోట్లను గత ప్రభుత్వం దారి మళ్లించింది. వారి నిర్వాకం వల్ల రాష్ట్రం గుంతలమయమైన రోడ్లతో విధ్వంసమైంది. అలాంటి క్లిష్ట పరిస్థితుల నుంచి అందరి సహకారంతో గట్టెక్కి, వ్యవస్థలను తిరిగి గాడిలో పెట్టగలిగాం" అని ముఖ్యమంత్రి వివరించారు. డబ్బులు లేవని చెప్పడం కాదని, వినూత్నంగా ఆలోచించి సంపద సృష్టించడంపై దృష్టి పెట్టాలని సీఎం పిలుపునిచ్చారు. "వెల్ఫేర్, డెవలప్‌మెంట్, వెల్త్ క్రియేషన్ అనేది ఒక సైకిల్ లాంటిది. అభివృద్ధి లేకుండా సంపద లేదు. సంపద లేకుండా సంక్షేమం లేదు. సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు భద్రత, భరోసా కల్పించాం. ఇప్పుడు పారిశ్రామిక ప్రగతి ద్వారా ఆర్థిక ప్రమాణాలు పెంచుతున్నాం" అని ఆయన తెలిపారు. 26 కొత్త పారిశ్రామిక విధానాలతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఏపీపై నమ్మకాన్ని కల్పించామని అన్నారు."కాలేజీ రోజుల్లో రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ నడపడం ఒక గర్వకారణంగా భావించేవాళ్లం. ఇప్పుడు అదే సంస్థను ఏపీకి తీసుకురాగలిగాం. రాష్ట్రంలో రోజుకో ఒప్పందం, వారానికో శంకుస్థాపన చేసుకునే స్థాయికి చేరుకున్నాం. ఇప్పటికే రూ.23 లక్షల కోట్ల విలువైన ఒప్పందాలు చేసుకున్నాం. ఇవి సాకారమైతే 24 లక్షల ఉద్యోగాలు వస్తాయి. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ వంటి దిగ్గజ కంపెనీలు ఏపీకి వచ్చాయి. గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్ రంగాల్లోనూ ముందుకు దూసుకెళ్తున్నాం" అని చంద్రబాబు వివరించారు. పాలనలో వేగం, జవాబుదారీతనం అత్యంత కీలకమని సీఎం ఉద్ఘాటించారు. "స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ అనేది కేవలం నినాదానికే పరిమితం కారాదు. 'ఫైల్స్ షుడ్ నాట్ మూవ్... రిజల్ట్స్ షుడ్ మూవ్' (ఫైళ్లు కాదు, ఫలితాలు కదలాలి) అనేదే మన విధానం కావాలి. ప్రజల నుంచి వచ్చిన ఆర్థికేతర ఫిర్యాదులను 100 శాతం పరిష్కరించాల్సిందే" అని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో బాగా పనిచేసిన చోట ప్రజల నుంచి సానుకూల స్పందన వస్తోందని, ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా పనిచేయాలని సూచించారు.

# విజయ్ పార్టీకి అందుకే మద్దతిస్తున్నాం: కాంగ్రెస్



**చెన్నై, పతాకం న్యూస్:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం, నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీకి మద్దతు ప్రకటించడంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోంది. ఈ రాజకీయ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ శాసనసభాపక్ష (సీఎల్పీ) నేత, ఎమ్మెల్యే ఎస్. రాజేశ్‌కుమార్ గురువారం స్పందించారు. కేవలం తమిళనాడు లౌకికవాద స్వరూపాన్ని కాపాడటం కోసం, రాష్ట్రంలో మతతత్వ శక్తులు బలపడకుండా నిలువరించడం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల తర్వాత మారుతున్న రాజకీయ సమీకరణాల మధ్య రాజేశ్‌కుమార్ ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు. పదవుల కోసం కాంగ్రెస్ పార్టీ తన సిద్ధాంతాలను పక్కన పెట్టిందంటూ వస్తున్న ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. కొన్ని రాజకీయ శక్తులు ఉద్దేశపూర్వకంగా కాంగ్రెస్ నిర్ణయాన్ని ప్రజా తీర్పునకు విరుద్ధమైనదిగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నాయని, కానీ తమిళనాడు విస్తృత ప్రయోజనాలు, సామాజిక సామరస్యాన్ని దృష్టిలో ఉంచుకునే తాము ఈ నిర్ణయం తీసుకున్నామని వివరించారు. "కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ లౌకికవాదానికి, సామాజిక న్యాయానికి కట్టుబడి ఉంది. ప్రజాతీర్పును, రాష్ట్ర భవిష్యత్తును పరిగణనలోకి తీసుకునే మా నిర్ణయం ఉంది" అని ఆయన పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రకటనకు ముందు నుంచే తమకు పలు రాజకీయ ఆహ్వానాలు వచ్చాయని, అయినా మతతత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా 'ఇండియా' కూటమిలోని లౌకిక శక్తులతోనే కలిసి నడిచామని రాజేశ్‌కుమార్ గుర్తుచేశారు. గత ఎన్నికల్లో లౌకిక ప్రగతిశీల కూటమి విజయానికి కాంగ్రెస్ కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేశారని, ఆరెస్సెస్, మతతత్వ శక్తులకు తమ పార్టీ సైద్ధాంతికంగా ఎప్పటికీ వ్యతిరేకమేనని పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా టీవీకే రాజకీయ వైఖరిని కూడా ఆయన ప్రస్తావించారు. విజయ్ నేతృత్వంలోని పార్టీ తమను తాము ఒక లౌకిక ఉద్యమంగా అభివర్ణించుకుందని గుర్తుచేశారు. టీవీకే అధినేత విజయ్, మాజీ ముఖ్యమంత్రి కె. కామరాజ్‌ను తన సైద్ధాంతిక స్ఫూర్తిగా బహిరంగంగా ప్రకటించారని, సామాజిక న్యాయ సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటానని ప్రతిజ్ఞ చేశారని రాజేష్ కుమార్ తెలిపారు.

## జన్‌మన్ పనులు వేగంగా జరగాలి



**చింతపల్లి, పతాకం న్యూస్:** జిల్లాలో జరుగుతున్న పీఎం జన్‌మన్ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఐటీడీఏ పీవో ఆదిత్య వర్మ ఆదేశించారు. ం మండలంలోని లంబసింగి, తాజంగి పంచాయతీల్లో ఆయన పర్యటించారు. పీఎం జన్‌మన్ నిధులతో జరుగుతున్న ప్రభుత్వ పాఠశాల భవనాల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. లంబసింగి ఉన్నత పాఠశాలలో పీఎం జన్‌మన్ పనులకు తలెత్తిన భూ సమస్యపై గ్రామస్థులతో ఆయన సమావేశమయ్యారు. భూ సమస్యపై పూర్తి నివేదికను రెండు రోజుల్లో సమర్పించాలని తహశీల్దార్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో మాట్లాడుతూ ప్రభుత్వం పీఎం జన్‌మన్ పథకం ద్వారా రహదారులు, ప్రభుత్వ పాఠశాల భవనాల నిర్మాణాలకు భారీగా నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ పనులను సంబంధిత కాంట్రాక్టర్లు సకాలంలో పూర్తి చేయాలన్నారు. నిర్మాణాల్లో కచ్చితంగా నాణ్యతా ప్రమాణాలు పాటించేలా ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షించాలని, నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆశ్రమ పాఠశాలల్లో అదనపు భవనాలు అందుబాటులోకి వస్తే విద్యార్థులకు వసతి సమస్య తీరుతుందన్నారు. అనంతరం లంబసింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగులకు అందుతున్న వైద్యసేవలు, వార్డులను స్వయంగా పరిశీలించారు. ఆస్పత్రిలో ప్రసవాలు తక్కువగా జరుగుతుండడంతో ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. రోగులకు వైద్యులు అందుబాటులో ఉండాలని, ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్యను పెంచాలన్నారు. వైద్య సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలని, విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రానున్న ఎపిడమిక్ సీజన్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవాలన్నారు. ఎంపిక చేసిన గిరిజన గ్రామాల్లో దోమల మందు మొదటి విడత పిచికారీ సమర్థవంతంగా జరిగిలే పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏపీసీ డాక్టర్ ఏవీ స్వామినాయుడు, తహశీల్దార్ కె. శంకరరావు, టీడబ్ల్యూ డీఈఈ రఘునాథరావునాయడు, ఏఈఈ యాదకిశోర్, ఎంఈవో పీబీవీవీ ప్రసాద్, కూటమి నాయకులు కిముడు లక్ష్మియ్య, పడాల్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు దేపూరి గిరిబాబు పాల్గొన్నారు.

## సకాలంలో జాతీయ రహదారి పనుల పూర్తి చేయాలి



**పాడేరు, పతాకం న్యూస్:** జిల్లాలో జరుగుతున్న జాతీయ రహదారి 516–ఈ పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను జాయింట్ కలెక్టర్ టి.శ్రీపూజ ఆదేశించారు. హైవే పనుల ప్రగతిపై కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జాతీయ రహదారి పనులను మరింత వేగవంతం చేసి, సకాలంలో పూర్తి చేసేందుకు ప్రణాళికలు వేసుకోవాలన్నారు. రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లింపుల్లో నెలకొనే సమస్యలను అధిగమించాలన్నారు. పెండింగ్ పరిహారాల చెల్లింపులు సకాలంలో జరిగేలా చూడడంతో పాటు రోడ్డు నిర్మాణంలో అటవీ అనుమతులకు సంబంధించిన అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. అధికారులు, ఇంజనీర్లు క్షేత్ర పర్యటనలు చేపట్టి సకాలంలో రోడ్డు నిర్మాణ పనులు జరిగేలా చర్యలు చేపట్టాలని, నాణ్యతగా నిర్మాణ పనులు జరగాలన్నారు. అలాగే హైవేలో పలు మలుపుల వద్ద ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలని, జనం ఉండే ప్రదేశాల్లో వీధి దీపాలను ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు పనులు జరుగుతున్న క్రమంలో ప్రజల రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో ఆదిత్యవర్మ, నేషనల్ హైవే అథారిటీ అధికారులు, ఇంజనీర్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## తెనెటీగల దాడిలో ఒకరికి తీవ్ర గాయాలు

**అనంతగిరి, పతాకం న్యూస్:** మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహలు కింద వైపు ఉన్న గోస్తనీ నది వద్ద తేనెటీగలు దాడి చేయడంతో ఒకరు తీవ్రంగా గాయపడగా, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. కోరాపుట్ జిల్లా నందపూర్‌కు చెందిన కొంతమంది గిరిజనులు ఆస్థికలు కలిపేందుకు బొర్రా గుహలు కింద వైపు ఉన్న గోస్తనీ నది వద్దకు బుధవారం చేరుకున్నారు. కొంతమంది స్నానాలు చేసేందుకు వెళ్లగా, నందపూర్‌కు చెందిన పూజారి కొల్యాసోమ్ని(76) హోమం చేసేందుకు ధూపం వేయడంతో సమీపంలో ఉన్న తేనెటీగలు ఒక్కసారిగా దాడి చేశాయి.

## కంబాలకొండలో కొత్త సొగసులు
# రాత్రి బస కోసం కాటేజీల నిర్మాణం



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** జంగిల్ బెల్స్...ట్రెక్కింగ్...అడవిలో అర్ధరాత్రి గడిపిన అనుభూతి కోసం పర్యాటకులు ఇప్పుడు నగరానికి దూరంగా అరకులోయో, అనంతగిరో వెళ్లాల్సిన అవసరం లేదు. ఎంచక్కా కంబాలకొండలోనే అవన్నీ ఎంజాయ్ చేయొచ్చు. జాతీయ రహదారిపై జంతుప్రదర్శనశాలకు ఎదురుగా ఉన్న వన్యప్రాణుల అభయారణ్యంలో అందుకు పూర్తి ఏర్పాట్లుచేశారు. త్వరలోనే వీటిని ప్రారంభిస్తున్నారు. అటవీ పర్యాటకం పెంచడానికి కేంద్ర ప్రభుత్వం ఇటీవల 'నగర వనయోజన' పేరుతో కొత్త పథకం అమలు చేస్తోంది. కర్ణాటకలో దీనిని ఉపయోగించుకొని నగరానికి దగ్గర్లోనే అటవీ ప్రాంతంలో పర్యాటకులు రాత్రి బస చేసిన అనుభూతి కలిగించేలా ఏర్పాట్లు చేశారు. దీనికి మంచి ఆదరణ లభించడంతో ఆ తరహాలోనే విశాఖలో కూడా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి పనులు చేపట్టింది. ఎంపీ శ్రీభరత్ చొరవతో జూ, కంబాలకొండలను పర్యాటకంగా అభివృద్ధి చేయడంపై ఇటీవల సింగపూర్ జూ బృందం వచ్చి అధ్యయనం చేసింది. వీఎంఆర్‌డీఏ కూడా కైలాసగిరితో పాటు జూ, కంబాలకొండలను పర్యాటకంగా మార్చడానికి ప్రణాళికలు రూపొందిస్తోంది. అంతా కలిసి పర్యాటకంపైనే దృష్టి పెట్టడంతో ముందుగా పర్యాటకులకు వసతులు కల్పించేందుకు అటవీ శాఖ రెండు కోట్ల రూపాయల వ్యయంతో కంబాలకొండలో ఐదు కాటేజీలు నిర్మించింది. మరో ఐదు నిర్మాణానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇవన్నీ తాత్కాలిక నిర్మాణాలే. రాత్రి బస చేసిన వారు తెల్లవారి లేచిన తరువాత ట్రెక్కింగ్ చేయడానికి 3/5/7 కి.మీ. చొప్పున వేర్వేరుగా వయస్సుల వారీగా మార్గాలు ఏర్పాటుచేశారు. ఇంకా పరిసర ప్రాంతాలను తిలకించడానికి ఎత్తైన టవర్, ఉడెన్ బ్రిడ్జిలు, నేచర్ వాక్ మార్గాలు, రోప్ వాకింగ్, బోటింగ్, వ్యూ పాయింట్లు వంటివి ఏర్పాటుచేశారు. ఇప్పుడు కంబాలకొండకు ప్రతి రోజూ 200 మంది, వారాంతాల్లో 500 నుంచి 600 మంది వస్తున్నారు. కాటేజీలను అద్దెకు ఇస్తే, వారికి ఆహారం, ఇతర సేవలు అందించేందుకు 25 మంది గిరిజన యువతకు ఉపాధి కల్పించనున్నారు. కాటేజీల అద్దె, ఇతరత్రా రేట్లు ఖరారు చేసి, వీలైనంత త్వరగా వీటిని ఉపయోగంలోకి తీసుకువస్తామని అటవీ వర్గాలు తెలిపాయి.

## సోలార్ పేరుతో బలవంతపు భూసేకరణ ఆపాలి




**దేవరాపల్లి, పతాకం న్యూస్:** చీడికాడ,జి కొత్తపల్లి అడివిల ఆగ్రహారం చినగోగాడ బైలుపూడి పంచాయతీల పరిదిలో సోలార్ ప్లాంట్లు నిర్మాణం పేరుతో చేపడుతున్న బలవంతపు భూసేకరణ తక్షణమే నిలుపుదల చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎ అప్పలరాజు వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రదాన కార్యదర్శి డి వెంకన్న, గోర్రెల మేకలు పెంపకం దార్ల సహకార సంఘం జిల్లా చైర్మెన్ గంటా శ్రీరాం, సిఐటియు మండల కార్యదర్శి రొంగలి దేముడు నాయుడులు డిమాండ్ చేశారు. గురువారం సోలార్ ప్లాంట్లుకు ప్రభుత్వం చేపడుతున్న భూ భాదిత రైతులు ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించిన అనంతరం నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సోలార్ పవర్ ప్లాంట్ పేరుతో, నాలుగు పంచాయతీల పేరుతో 262 ఎకారాల భూమిని రైతులు నుండి ప్రభుత్వం బలవంతంగా లాక్కోవాలని చూస్తుందని, దీన్ని రైతులు ఏకగ్రీవంగా వ్యతిరేకించారని అన్నారు. అయిప్పనటికి రెవెన్యూ తహశీల్దార్ బలవంతంగా నోటీసులు ఇవ్వడం అత్యంత దారుణమని అన్నారు. పట్టాలు లేవని, ఒకవేళ పట్టాలు ఉన్నా ప్రభుత్వ భూములని, రైతులకు హక్కులు లేవని పోలీసులతో బలవంతంగా ఖాళీ చేయిస్తామని బెదిరిస్తున్నారని అన్నారు. జి. కొత్తపల్లి సర్వే నెంబరు,167 లో 40 ఎకరాలు అడవుల అగ్రహారం లో 55 ఎకరాలు, బైలపూడి లో 60 ఎకరాలు, చిన్న గోవాడ లో పూర్వకాలం నుండి రైతులు సాగు చేసుకుటున్నారని, వీటికి 40 సంవత్సరాలు క్రితమే ప్రభుత్వ, అదికారులు సాగదార్లుకు హక్క పత్రాలు మంజూరు చేసారని అన్నారు. ఇటీవల ఈ భూముల్లో కేంద్ర ప్రభుత్వం ఏపీ ఈపీడీసీఎల్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం 57.97 మెగా వాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్ ని నిర్మించనున్నట్లు ప్రకటించిందని , దీంతో భూసేకరణను చేపడుతుందని అన్నారు. ఈభూముల్లో ఉన్న వందలాది రైతు కుటుంబాలు జీడి మామిడి, పామాయిల్, నువ్వులు, వేరుశనగ వంటి పంటలు పండించుకుంటు దాని పై వచ్చిన ఆదాయంతో ఉపాధి పొందుతున్నారని అన్నారు. ఇటువంటి విలువైన భూములను ప్రభుత్వ, అదికారులు రైతులను బెదిరించి బలవంతంగా లాక్కోవాలని చూస్తున్నారని మండిపడ్డారు.

## విశాఖ జిల్లా ప్రజా ప్రతినిధులతో
# సీఎం చంద్రబాబు సమీక్ష సమావేశం



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ప్రజలకు మేలు చేసేలా అనేక నిర్ణయాలు తీసుకుంటున్నామని, వాటిని సక్రమంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులదేనని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. కూటమి పార్టీల నేతలు, క్యాడర్ మధ్య సఖ్యత ఉండాలని, క్యాడర్ బాగోగులు పట్టించుకోవాలని సూచించారు. ఇందుకుగాను కూటమి నేతలు తరచూ సమావేశాలు ఏర్పాటుచేసుకోవాలని ఆదేశించారు. అమరావతిలో విశాఖ జిల్లా ప్రజా ప్రతినిధులతో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ ప్రజా ప్రతినిధుల పనితీరు, వ్యవహారశైలి, సమస్యల పరిష్కారం, ప్రజలకు అందుబాటులో ఉండడం వంటి అంశాల ఆధారంగా నివేదికలు రూపొందించామన్నారు. విశాఖపట్నం కూటమికి కంచుకోట అని అందుకు తగినట్టుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. విశాఖ ప్రజలు అంటే తనకు ఎంతో గౌరవమని, 2019లోనూ నగరవాసులు టీడీపీ వెంటే నిలిచారని గుర్తుచేశారు. విశాఖ చాలా ప్రశాంత నగరమని, శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలగకూడదని స్పష్టంచేశారు. విశాఖలో సైబర్ నేరాలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమీక్షా సమావేశాల్లో ప్రజా ప్రతినిధులు ప్రస్తావించిన పనులను ప్రాధాన్యతాక్రమంలో పూర్తిచేస్తామన్నారు. కేజీహెచ్ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేలు కోరగా, మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ మాట్లాడుతూ కేజీహెచ్ అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ఆర్థికతోడ్పాటు అందిస్తారని వెల్లడించారు. విశాఖ రైల్వే జోన్ గెజిట్ రావడానికి విశేషంగా కృషిచేసిన చంద్రబాబునాయుడుకు ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ భూముల్లో ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ, టిడ్కో ఇళ్ల కేటాయింపు పూర్తి చేయాలని సీఎంను కోరారు. హౌసింగ్ కాలనీల్లో మంచినీరు సరఫరా చేయాలని కోరారు. హనుమంతువాక, మద్దిలపాలెం, ఎన్ఏడీ నుంచి ఎయిర్‌పోర్టు నడుమ ఫ్లైఓవర్లు నిర్మించాలని కోరారు. ఈ సమావేశానికి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబు, పి.విష్ణుకుమార్‌రాజు, పంచకర్ల రమేష్‌బాబు, సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్, విశాఖ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పాల్గొన్నారు.

## కొత్త గ్యాస్ కనెక్షన్ల జారీ నిలిపివేత



**గాజువాక, పతాకం న్యూస్:** హెచ్‌పీసీఎల్, ఐఓసీ, బీపీసీఎల్ కంపెనీలు గత నెల రోజులుగా కొత్త గ్యాస్ కనెక్షన్ల జారీని నిలిపివేశాయి. యుద్ధం ప్రారంభం కావడానికి ముందు అడిగిన వెంటనే గ్యాస్ కనెక్షన్ ఇచ్చేవారు. ఇప్పుడు...లేదన్న సమాధానం ఏజెన్సీల నుంచి వస్తోంది. ఈ నిషేధం ఎప్పటి వరకు కొనసాగుతుందో చెప్పలేమని కూడా అంటున్నారు. గ్యాస్ సరఫరాలో ఇబ్బందులు ఉన్నందున కొత్త కనెక్షన్ల జారీకి బ్రేక్ పడిందని పేర్కొంటున్నారు.

## పక్కాగా జనగణన నమోదు చేయాలి: కలెక్టర్ నిషాంతి



**పాడేరు, పతాకం న్యూస్:** జనగణన–2027లో భాగంగా జిల్లాలోని ప్రతి ఒక్కరినీ జనగణన పరిధిలో నమోదు చేయాలని అధికారులను కలెక్టర్ టి.నిషాంతి ఆదేశించారు. కలెక్టర్లు, ఎస్పీల సదస్సులో పాల్గొనేందుకు అమరావతి వెళ్లిన ఆమె అక్కడి నుంచి నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జనగణనలో భాగంగా ప్రతి ఒక్కరికి సంబంధించిన వివరాలను కచ్చితంగా నమోదు చేయాలన్నారు. అలాగే జనగణనపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని, అందుకు గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారం చేయాలన్నారు. గ్రామాల్లో దండోరాలు వేయడం, కళాజాత ప్రదర్శనలు, మినీ వాహనాల్లో మైకుల ద్వారా ముమ్మరంగా ప్రచారం చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జనగణన ప్రక్రియను అత్యంత ప్రాధాన్యంగా భావించి, పారదర్శకంగా చేపట్టాలన్నారు. జనగణనలో ఎవరికీ ఎటువంటి మినహాయింపులు లేవని, నిబంధనల మేరకు గణన జరగాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావు, జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి ప్రసాదరావు, కలెక్టరేట్ పరిపాలనాధికారి ప్రసాదరావు, డీపీఆర్‌వో కె.వెంకటరావు, తదితరులు పాల్గొనారు.

## వర్తనాపల్లి శివాలయానికి రూ.55 లక్షలు మంజూరు

**పాడేరు, పతాకం న్యూస్:** పాడేరు మండలం వర్తనాపల్లి గ్రామంలో గల శివాలయాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేసేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం రూ.55 లక్షలు మంజూరుచేసింది. ఈ ఏడాది మార్చి 14న పాడేరు మండలం నందిగరువు పర్యటనకు విచ్చేసిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తిరుగు ప్రయాణంలో వర్తనాపల్లిలోని శివాలయాన్ని దర్శించుకున్నారు. అదిచాలా ఏళ్ల కిత్రం నిర్మించినది కావడంతో జీర్ణావస్థకు చేరి ఉంది. ఆ విషయం గుర్తించిన ఆయన శివాలయం అభివృద్ధికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఉన్నతాధికారులకు లేఖలు రాశారు. దీంతో టీటీడీ నుంచి వర్తనాపల్లిలోని శివాలయం అభివృద్ధికి రూ.55 లక్షలు మంజూరయ్యాయి. ఆ నిధులతో ఆలయాన్ని పునర్నిర్మించడంతో అవసరమైన మరిన్ని విగ్రహాలు, భక్తులు సేదతీరేందుకు మండపం, తాగునీటి సదుపాయం, మైక్ సెట్ తదితరాలు సమకూర్చుతారు. వర్తనాపల్లి శివాలయానికి రూ.55 లక్షలు మంజూరు చేసినందుకు సీఎం చంద్రబాబునాయుడుకు, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు, సభ్యులకు, అధికారులకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ధన్యవాదాలు తెలిపారు.

## కొత్తవలస జూట్‌మిల్ షట్‌డౌన్



**కొత్తవలస, పతాకం న్యూస్:** కొత్తవలసలోని ఉమా జూట్ మిల్లును సుమారు రెండు సంవత్సరాల కిందటే లాకౌట్ నుంచి తెరచి యాజమాన్యం కార్మికులకు పని కల్పించింది. గతంలో ఉన్న యాజమాన్యం స్థానంలో కొత్త యాజమాన్యం పగ్గాలు చేపట్టింది. కార్మికులకు బకాయిలను క్లియర్ చేసింది. పదవీ విరమణ చేసిన, చనిపోయిన కార్మికులకు చెల్లించాలసిన బకాయిలను ఇచ్చేసింది. యాజమాన్యం, కార్మికులు మంచి అవగాహనతో పని చేసుకుంటూ ఉత్పత్తి చేస్తున్న తరుణంలో ముడిసరుకు సమస్య తలెత్తింది. దీనిపై యాజమాన్యం ముందుగా కార్మికులతో చర్చించి షట్ డౌన్‌కు దారి తీసిన పరిస్థితులను వివరించి సహకరించాలని కోరింది. ఒక వేళ మూడునెలలులోగా జనపనార అందుబాటులోకి వస్తే మిల్లును తెరిచి ఉత్పత్తి సాగించడానికి అంగీకారం తెలిపింది. జూట్‌మిల్లులకు ప్రధాన ముడిసరుకు అయిన జనపనార పంట పశ్చిమబెంగాల్‌తో పాటు బంగ్లాదేశ్ నుంచి దిగుమతి అవుతుంది. బంగ్లాదేశ్ నుంచి వచ్చే జనపనారను ఏజెంట్లు ముందుగా కొనుగోలు చేసి జూట్ మిల్లులకు విక్రయిస్తారు. అయితే బంగ్లాదేశ్ నుంచి మన దేశానికి దిగుమతి అయ్యే జనపనార ఆగిపోయింది. మరోవైపు పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో విరివిగా జనపనారను పండిస్తారు. ఆ రాష్ట్రంలో సుమారు 140 వరకు జూట్ మిల్లులు ఉన్నాయి. వీటిలో చాలామిల్లులు మూతపడ్డాయి. అయితే కేంద్ర ప్రభుత్వం జూట్ మిల్లులకు పలు రాయితీలు ప్రకటించడంతో ఆ రాష్ట్రంలోని అన్ని జూట్ మిల్లులు తెరుచుకున్నాయి. దీంతో జూట్ కొరత ఏర్పడింది. గతంలో జనపనార ధర కేజీ 60 నుంచి 70 రూపాయలు ఉండగా జనపనార నుంచి తయారు చేసే పురికొసల ధరలు కేజీ 170 రూపాయల వరకు ఉండేది. ప్రస్తుతం జనపనార ధర కూడా 170 రూపాయలు అయిపోవడంతో పాటు పురి కొసలు ధరలు మాత్రం కేజీ 170 రూపాయలే ఉండడంతో ఉత్పత్తి వ్యయం పెరిగిన కారణంగా మిల్లును షట్ డౌన్ చేయాల్సి వస్తోందని యాజమాన్యం చెబుతోంది. గతంలో విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో జనపనార పంట విరివిగా సాగులో ఉండేది. జూట్‌మిల్లులు సంక్షోభంలో పడ్డంతో ఈ పంటను రైతులు వేయడం మానేశారు. అలాగే కోసిన తరువాత కనీసం నెల రోజుల పాటు చెరువుల్లో నాన బెట్టి నార తీయాల్సి ఉంటుంది. వర్షాభావ పరిస్థితుల వల్ల కొన్నిసార్లు పంట ఎండిపోయి పాడై పోయేది. పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో జనపనారను నాన బెట్టుకోవడానికి గంగానది నీటిని కేటాయిస్తారని చెబుతున్నారు.

## ప్రజల్లోకి ప్రభుత్వ అవినీతి తీసుకెళ్లాలి: సజ్జల

**అమరావతి, పతాకం న్యూస్:** ప్రభుత్వ అవినీతిని వైసిపి నాయకత్వం ప్రజల్లోకి



తీసుకెళ్లాలని వైసిపి రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి సూచించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలతో ఆయన మాట్లాడారు. ఎస్ఐఆర్‌పై చర్చ అనంతరం రైతులకు సంబంధించి ఈ వారం, వచ్చేవారం ఆస్పత్రుల సందర్శన, ఆరోగ్యశ్రీ నిర్వీర్యంపై నిరసన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వైసిపి ప్రభుత్వంలో జరిగిన మంచిని, కూటమి ప్రభుత్వ మోసాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. దోపిడీ, ఉన్మాదం, అవినీతి, రెడ్ బుక్ పాలనపై నియోజకవర్గాల్లో ప్రణాళిక రూపొందించుకోవాలని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ పై మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి కన్నబాబు, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, అశోక్ బాబు, అబ్బయ్య చౌదరి, కొరుముట్ల శ్రీనివాసులు, వెంకట్రామిరెడ్డి, మల్లాది విష్ణు పాల్గొన్నారు.

## సమగ్ర శిక్ష ఉద్యోగులు సమస్యల పరిష్కారం కోసం పాదయాత్ర



**విజయనగరం, పతాకం న్యూస్:** జెఎసి పిలుపు మేరకు మే 15, 2026న నిర్వహించనున్న పాదయాత్ర కార్యక్రమానికి సంబంధించి గురువారం విద్యాశాఖాధికారి కార్యాలయం లో జిల్లా విద్యాశాఖ అధికారి యు. మాణిక్యం నాయుడు కి సమాచార పత్రం అందించారు. జరిగింది.సమగ్ర శిక్షా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఏపీ సమగ్ర శిక్షా కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (జెఎసి) రాష్ట్ర కమిటీ పాదయాత్రకు పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. సమగ్ర శిక్షా ఉద్యోగులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఉద్యోగుల రెగ్యులరైజేషన్, హెచ్ఆర్ పాలసీ అమలు, సమాన పనికి సమాన వేతనం, మినిమం టైమ్ స్కేల్, ఈపీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ, మెడికల్ లీవులు, మహిళలకు చైల్డ్ కేర్ లీవులు తదితర డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. అలాగే మే 15న ప్రకాశం బ్యారేజ్ నుండి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నివాసం వరకు కుటుంబ సభ్యులతో కలిసి నిర్వహించనున్న పాదయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఛైర్మన్ బి. కాంతారావు నాని, జిల్లా ఛైర్మన్ ఆర్. శ్రీనివాసరావు, ఎం.ఐ.ఎస్ కోఆర్డినేటర్ జిల్లా నాయకులు కృష్ణం నాయుడు, మండల లెవెల్ అకౌంటెంట్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో పోరాటాలు



**భీమవరం, పతాకం న్యూస్:** విద్యారంగం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో పోరాటాలు చేయాలని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తి పిలుపునిచ్చారు. అల్లూరి పోరాట స్ఫూర్తి నేటికి చిరస్మరణీయమని ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. భీమవరంలో యుటిఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అల్లూరి 102 వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భీమవరం అడ్డ వంతెన వద్ద ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ఎమ్మెల్సీ గోపి మూర్తి, యుటిఎఫ్ నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ గోపి మూర్తి మాట్లాడుతూ "భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో ఎన్నో విప్లవ జ్యోతులు వెలిగాయని ఆ జ్యోతులలో అజరామరమైన పేరు అల్లూరి సీతారామరాజు అన్నారు. బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా గిరిజనులను ఏకం చేసి ఆయుధ పోరాటానికి నాయకత్వం వహించిన అల్లూరి, కేవలం ఒక వ్యక్తి కాదు --- ఒక యుగం, ఒక ఉద్యమం, ఒక తిరుగుబాటు చిహ్నమన్నారు. ఆయన పోరాటం కేవలం ఆంగ్లేయులపై రాజకీయ స్వాతంత్ర్యం కోసం మాత్రమే కాదని దోపిడీ, అణచివేత, సామాజిక అన్యాయం, ప్రకృతి సంపదల దోపిడీకి వ్యతిరేకంగా సాగిన ప్రజా సంగ్రామన్నారు.

నేడు దేశంలో మారుతున్న రాజకీయ, ఆర్థిక పరిస్థితులను పరిశీలిస్తే, అల్లూరి పోరాటం మరింత ప్రాసంగికంగా కనిపిస్తుందన్నారు. అప్పట్లో బ్రిటిష్ పాలకులు అడవులను, భూములను, ప్రజల హక్కులను దోచుకున్నట్లే నేడు కార్పొరేట్ అనుకూల ప్రభుత్వాలు ప్రకృతి సంపదలను పెద్ద కంపెనీలకు అప్పగిస్తూ సామాన్య ప్రజల జీవితాలను సంక్షోభంలోకి నెట్టుతున్నాయన్నారు. అందుకె అల్లూరి పోరాటం నేటి ప్రజా ఉద్యమాలకు ఒక చారిత్రక స్ఫూర్తిగా నిలుస్తోందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పోలిశెట్టి క్రాంతి కుమార్ మాట్లాడుతూ అల్లూరి చిన్న వయస్సులోనే దేశభక్తి భావాలతో దేశమంతా తిరిగి ప్రజల బాధలను ప్రత్యక్షంగా తూర్పు ఘాట్ అడవుల్లో గిరిజనుల పరిస్థితిని చూసిన ప్రజల మధ్యే జీవించాడన్నారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఆయుధ పోరాటమే సరైన మార్గమని, ప్రజల శక్తిపై విశ్వాసం ఉంచి, ప్రజలను సమీకరించి పోరుబాట పట్టించాడన్నారు.

## ఆక్రమణదారులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు




**జామి, పతాకం న్యూస్:** మండలం కేంద్రంలో ఉన్న జేఏ చానెల్ ఆక్రమణలకు గురైనా సంబంధిత శాఖలు ఎందుకు పట్టించుకోవడం లేదని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ఇరిగేషన్ అధికారులను ప్రశ్నించారు. ఆక్రమణలు తొలగించడం చేతకాకపోతే తప్పుకోవాలని మందలించారు. ఆక్రమణలు తొలగించి ఆయకట్టు రైతులకు సాగునీరు అందేలా చూడాలన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సబ్బవరపు అరుణ ఆధ్వర్యంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎంపీటీసీలు, ఎంపీపీ, జడ్‌పీటీసీ సభ్యులు మట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాల్లో అధికారులు ఎందుకు ప్రోటోకాల్ పాటించడం లేదని ప్రశ్నించారు. మండలంలో టెండర్ల ప్రకారం చేయించాల్సిన రూ.నాలుగు కోట్ల 20లక్షల పనులు ఇతరులకు ఎలా కట్టబెట్టారని పంచాయతీరాజ్ జేఈతో పాటు ఎంపీడీవోను ప్రశ్నించారు. వెంటనే పనులు రద్దుచేసి టెండర్ల ద్వారా కేటాయించాలన్నారు. గ్రామాల్లో పుట్టగొడుగుల్లా బెల్ట్‌షాపులు వెలిశాయని.. వాటిని నిరోధించడంలో ఎందుకు వి ఫలమవుతున్నారని ఎక్సైజ్ అధికారులను ప్రశ్నించారు. ఎమ్మెల్సీ మట్లాడుతూ రీసర్వే ద్వారా రైతులకు ఇచ్చే పాసుపుస్తకాలకు ప్రభుత్వం రూ.700కోట్లు కేటాయించిందని... రెవెన్యూ అధికారులు నిజాయితీగా సర్వే చేయాలన్నారు. మండల ప్రత్యేకాధికారిగా ఉన్న డ్వామా పీడీ తీరుపై ఎంపీటీసీ సభ్యులు ఆక్షేపణ వ్యక్తం చేశారు. లోట్లపల్లిలో మేట్లు తమకు వేతనదారుల నుంచి రూ.300 వంతున వసూలు చేస్తున్నారని ఆరోపించారు. పంచాయతీల్లోనూ ఇదే తీరు ఉందన్నారు. ఈ సమావేశంలో జడ్‌పీటీసీ సరయు తదితరులు పాల్గొన్నారు. ఇదిలాఉండగా... ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. జామిలో లండ దేముడు అనే వృద్ధుడికి ప్రభుత్వం పింఛను అందించేవరకు బీజేపీ నాయకురాలు ఆదిలక్ష్మి ద్వారా నెలకు రూ.రెండువేల వంతున అందిస్తానని చెప్పారు.

## హెల్మెట్ వాడకంలో నిర్లక్ష్యం వద్దు



**టెక్కలి, పతాకం న్యూస్:** ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడకంలో నిర్లక్ష్యంగా ఉండొద్దని టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి సూచించారు. అభయం హెల్మెట్ బ్యాంక్ ఆధ్వర్యంలో టెక్కలిలో అవగాహన ర్యాలీ నిర్వ హించారు. ఈ ర్యాలీని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, డీఎస్పీ లక్ష్మణరావు ప్రారంభిం చారు. పాతజాతీయ రహదారి డిగ్రీ కళాశాల నుంచి ఇందిరాగాంధీ జంక్షన్ వరకు ఈ ర్యాలీ కొనసాగించి ప్రజల్లో రోడ్ల భద్రత, హెల్మెట్ ప్రాముఖ్యతపై వివరించారు. హెల్మెట్ లేని వాహనచోదకుల్ని గుర్తించి అభయం హెల్మెట్ బ్యాంక్ ద్వారా హెల్మెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు 20శాతం వరకు పోలీసులు తగ్గించారని, హెల్మెట్ ధరించ కపోతే రూ.1,035 అపరాధ రుసుం విధిస్తారని తెలిపారు. డీఎస్పీ లక్ష్మణరావు మాట్లాడుతూ.. గత రెండేళ్ల గణాంకాలు పరిశీలిస్తే వాహనచోదకులు హెల్మెట్లు ధరించకపోవడం వలనే పలువురు రోడ్డు ప్రమాదాలు బారిన పడుతున్నారని, అందువలన హెల్మెట్ ధరించి ప్రాణాలను రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. సీఐలు ఎ.విజయ్‌కుమార్, శ్రీనివాసరావు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## భావితరాలకు అల్లూరి స్ఫూర్తి

**విజయనగరం, పతాకం న్యూస్:** మన్యం వీరునిగా, దేశభక్తుడిగా అల్లూరి సీతారామరాజు భావితరాలకు స్ఫూర్తిదాయకమని సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు కొనియాడారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అల్లూరి వర్ధంతిని పురస్కరించుకుని ఆ మహనీయుని త్యాగనిరతిని శ్లాఘించారు. ముందుగా అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు మాట్లాడుతూ నాటి బ్రిటిష్ పాలకుల దాస్టీకాన్ని వ్యతిరేకిస్తూ గెరిల్లా యుద్ధం జరిపి చివరకు పరపాలకుల తూటాలకు బలైపోయిన ధైర్య సాహసి అల్లూరి సీతారామరాజు అని అన్నారు. మన్యం ప్రాంతాల్లో గిరిజనులను చైతన్య పరిచి, సమీకరించి బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని గడగడలాడించిన వీరుడు అల్లూరి సీతారామరాజు అని అన్నారు. స్వతంత్ర పోరాటంలో ఆయన చూపిన తెగువ, ధైర్యం ఎందరికో స్ఫూర్తినిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు





**పార్వతీపురం, పతాకం న్యూస్:** జిల్లాలో ఈనెల 21 నుంచి జరగనున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని డీఆర్వో కె.హేమలత ఆదేశించారు. తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. ' 16 కేంద్రాలో నిర్వహించే ఈ పరీక్షలకు 4,731 మంది విద్యార్థులకు హాజరుకానున్నారు. వారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలి. ఎండ తీవ్రత దృష్ట్యా పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలి. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండరాదు. అన్నిచోట్లా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. అతి సున్నితమై కేంద్రాల వద్ద అదనపు బలగాలను మోహరించి.. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలి. ఇంటర్ మొదటి సంవత్సరం వారికి ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. కేంద్రాల వద్ద పోలీస్ బందో బస్తు ఏర్పాటు చేయాలి. జెరాక్స్ షాపులు తప్పనిసరిగా మూసి వేయించాలి. ఆయా ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుంది. ప్రశ్న పత్రాలను 13 పోలీస్ స్టేషన్లలో భద్రపరిచాం.' అని ఆమె తెలిపారు.

## మార్పు రాకుంటే చర్యలు తప్పవు



**సీతానగరం, పతాకం న్యూస్:** మ్యాజిక్ డ్రైనేజీల నిర్మాణంపై అవగాహన ఉండాలని పంచాయతీరాజ్, ఉపాధి హామీ జాయింట్ కమిషనర్ ఎం.శివప్రసాద్ అన్నారు. పెదపెంకిలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పారిశుధ్యం నివారణ, ఇతర సమస్యలపై దిశానిర్దేశం చేశారు. మ్యాజిక్ డ్రైనేజీలతో ఎక్కడికక్కడే మురుగునీరు ఇంకిపోతుందన్నారు. మురుగునీటి సరఫరా కాలువల నిర్మాణం కంటే నూతన విధానం ఎంతో మేలన్నారు. ఈ పరిశీలనలో డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఏపీడీలు తదితరులు ఉన్నారు.

## వేర్వేరు కేసుల్లో ముగ్గురు అరెస్ట్. రూ50 లక్షల చోరీ సొత్తు స్వాధీనం



**కాకినాడ, పతాకం న్యూస్:** జిల్లాలో వరుస చైన్ స్నాచింగ్‌లు, ఇంటి దొంగతనాలు, మోటార్ సైకిల్ చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను కాకినాడ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 50 లక్షల 16 వేల విలువైన బంగారం, వెండి వస్తువులు, నగదు, మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులకు సంబంధించి గురువారం జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ విలేకరులకు వివరాలను తన కార్యాలయంలో వెల్లడించారు. కాకినాడ-2 టౌన్, సర్పవరం, పిఠాపురం, ఇంద్రపాలెం, కోరింగ పోలీస్ స్టేషన్ల పరిధితో పాటు కోనసీమ జిల్లా దాక్షారామం లో నమోదైన 12 కేసులను పోలీసులు ఛేదించగా వీటిలో ఏడు చైన్ స్నాచింగ్‌లు, రెండు ఇంటి దొంగతనాలు, ఒక ఏటీఎం కార్డు మోసం, రెండు మోటార్ సైకిల్ చోరీ కేసులు ఉన్నాయన్నారు. చైన్ స్నాచింగ్ కేసుల్లో అరెస్టైన పల్లా సురేంద్ర కుమార్, రంగాల శ్రీనివాసరెడ్డి వద్ద నుంచి 320 గ్రాముల బంగారం, 600 గ్రాముల వెండి, 40 వేల నగదు, ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి విలువ 46 లక్షల 50 వేల రూపాయలని ఎస్పీ చెప్పారు. మరో నిందితుడు రచ్చ నాగ సతీష్ కుమార్ అలియాస్ బబ్లు వద్ద నుంచి 430 గ్రాముల వెండి, మూడు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ 3 లక్షల 66 వేల వరకు ఉంటుందని చెప్పారు. నిందితులు ఒంటరిగా వెళ్తున్న మహిళలు, వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకుని చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ఏటీఎంల వద్ద వృద్ధులకు సహాయం చేస్తున్నట్లు నటించి కార్డులు మార్చి నగదు దోచుకునే వారని పేర్కొన్నారు. తాళాలు వేసి ఖాళీగా ఉన్న ఇళ్లను గుర్తించి దొంగతనాలు చేయడం, బయట పార్క్ చేసిన మోటార్ సైకిళ్లను దొంగిలించడం వీరి నేర ప్రవృత్తి గా వెల్లడైందన్నారు.

## పరిహారం ఇవ్వకుండా చేస్తున్న పనులను అడ్డుకున్న రైతులు



**కర్నూలు, పతాకం న్యూస్:** పరిహారం చెల్లించకుండా కర్నూలు జిల్లా ఆలూరు మండలం మనేకుర్తి గ్రామంలో చేపట్టిన పవర్ గ్రిడ్ పనులను రైతులు అడ్డుకున్నారు. ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన ఈ కార్యక్రమం చేపట్టారు. కంపెనీ సిజిఎంను నిలదీశారు. దీంతో, కంపెనీ ప్రతినిధులు పనులను నిలిపివేసి వెనుదిరిగారు. సారవంతమైన పంట భూముల సేకరణకు వ్యతిరేకంగా రైతులు గతంలో ఆందోళనకు దిగారు. అయినా, ప్రభుత్వ అధికారులు, పవర్ గ్రిడ్ అధికారులు రైతుల ఆర్థిక ఇబ్బందులను గుర్తించి వారిని నమ్మించి, భయభ్రాంతులకు గురి చేసి 191.66 ఎకరాలను బలవంతంగా లాక్కున్నారు. నాలుగు నెలలు కావస్తున్నా పరిహారం అందించకుండా ఆ భూముల్లో చదును పనులు చేపడుతున్నారు. దీంతో, ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన రైతులు ఈ పనులను అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో అక్కడికి వచ్చిన పవర్ గ్రిడ్ కార్పొరేషన్ సిజిఎం శ్రీనివాస్ మూర్తిని నిలదీశారు. తమతో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఎకరాకు రూ.18 లక్షలు, రీసర్వేతో సంబంధం లేకుండా పట్టా పాసుపుస్తకంలో ఎంత విస్తీర్ణం ఉంటే అంత పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంట నష్టపరిహారం కింద ఎకరాకు మిర్చికి రూ.1.50 లక్షలు, పత్తికి రూ.95 వేలు, ఇంకుడు గుంతలకు, డ్రిప్ వేసుకున్న రైతులకు, పొలాల్లోని చెట్లకు పరిహారం ఇవ్వాలని ఒప్పందం చేసుకొని నాలుగు నెలలు అవుతున్నా ఎటువంటి పరిహారమూ ఇవ్వకుండా పనులు చేపట్టడం ఏమిటని ప్రశ్నించారు. తమకు పూర్తి స్థాయిలో పరిహారం ఇచ్చిన తర్వాతే పనులు మొదలు పెట్టాలని డిమాండ్ చేశారు. అంతవరకూ పనులు జరగనివ్వబోమని తేల్చి చెప్పారు. దీంతో, కంపెనీ ప్రతినిధులు పనులను నిలిపుదల చేసి వెనుదిరిగారు. ఈ కార్యక్రమంలో రైతులు చిన్నఆంజనేయ, ప్రకాష్, నాగరాజు, వీరేష్, లక్ష్మి కాంత్, విజయ్, ఆగులూరి, దేవేంద్ర, రైతు సంఘం స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఫీడర్ల సోలరైజేషన్ వేగవంతం చేయాలి



**అమరావతి పతాకం న్యూస్:** వినియోగదారులకు త్వరితగతిన సర్వీసు అందించడంతో పాటు రెవెన్యూ కలెక్షన్స్ నూరు శాతం సాధించాలని అధికారులను ఎపిసిపిడిసిఎల్ సిఎమ్‌డి పి పుల్లారెడ్డి ఆదేశించారు. సిపిడిసిఎల్ కార్యాలయంలో అన్ని జిల్లాల ఎస్ఇలు, ఇఇలతో ఫీడర్ లెవెల్ సోలరైజేషన్, ఎస్‌సి, ఎస్‌టి వినియోగదారులకు సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటు, పిఎం సూర్యఘర్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎమ్‌డి మాట్లాడుతూ.. లో ఓల్టేజ్ సమస్యను వెంటనే పరిష్కరించాలని, అన్ని ఫీడర్లనూ బ్రేక్‌డౌన్ లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. సరైన సమయానికి బిల్లింగ్ పూర్తి చేయాలన్నారు. నూతనంగా నిర్మించనున్న సబ్‌స్టేషన్ల పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. మూడు ప్రశ్నల ద్వారా నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో ఎపిసిపిడిసిఎల్ పరిధిలో 78.1 శాతం ప్రజలు సానుకూలత వ్యక్తం చేశారని తెలిపారు. పబ్లిక్ పర్సెప్షన్ 90 శాతం కంటే ఎక్కువ ఉండాలని, ఆర్‌డిఎస్‌ఎస్ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో డైరెక్టర్ టెక్నికల్ మురళీకృష్ణ యాదవ్, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ టివిఎస్‌ఎన్ మూర్తి, డైరెక్టర్ ఫైనాన్స్ వెంకటేశ్వర్లు, సిజిఎంలు, జిఎంలు పాల్గొన్నారు.

## ఐడిఎఫ్‌సి బ్యాంకు ఏటీఎంను ఎత్తుకెళ్లిన చేసిన దొంగలు



**ధర్మవరం, పతాకం న్యూస్:** శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలో ఎటిఎంను కొందరు దుండగులు ఎత్తుకుపోయారు. నగదు ఎత్తుకెళ్లేందుకు వచ్చిన దుండగులుకు మిషన్ తెరవడం కష్టం కావడంతో ఏకంగా ఎటిఎం మొత్తం పట్టుకుపోయారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు... ధర్మవరం పట్టణం పుట్టపర్తి రోడ్ పార్థసారథి నగర్‌లో ఎడిఎఫ్‌సి బ్యాంకు.. అక్కడే దానికి సంబంధించిన ఎటిఎం కేంద్రం ఉన్నాయి. తెల్లవారుజామున మూడు గంటల సమయంలో నలుగురు దుండగులు పక్కా ప్రణాళికతో ఎటిఎంలో నగదు దొంగతానికి వచ్చారు. ముందుగా ఎటిఎంను బద్దలు కొట్టేందుకు ప్రయత్నించారు. అది తెరుచుకోకపోవడంతో తాడును ఎటిఎం మిషన్‌కు కట్టి బొలెరోలతో పెకలించారు. ఎటిఎం మిషన్ మొత్తం ఊడి రావడంతో దానిని వారు తెచ్చుకున్న బొలెరో వాహనంలో వేసుకుని ఎత్తుకెళ్లిపోయారు. దొంగతనం వ్యవహారం మొత్తం సిసి కెమెరాలో నమోదయ్యింది. దొంగతనం చేసేందుకు వచ్చిన నిందితులు ముఖానికి మాస్కులు ధరించి ఉన్నారు. బుధవారం తెల్లారుజామున ఇది గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వన్‌టౌన్ సిఐ నాగేంద్ర ప్రసాద్, ఎస్ఐ ఉమాదేవి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఎటిఎం దొంగతనం విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో పెద్ద ఎత్తున చర్చనీయాంశమయ్యింది. బ్యాంకు వద్ద శ్రీసత్యసాయి జిల్లా ఎస్‌పి సతీష్ కుమార్, ధర్మవరం డిఎస్‌పి నర్సింగప్ప తనిఖీలు చేపట్టి, బ్యాంకు మేనేజర్ లోక్‌నాథ్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎటిఎంలో రూ.ఏడు నుంచి రూ.10 లక్షల వరకు నగదు ఉంటుందని మేనేజర్ తెలిపారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని సిఐ తెలిపారు.

# జూన్ నుంచి సంజీవని ప్రోగ్రామ్ అమలు?



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు మెరుగైన, అత్యాధునిక వైద్య సేవలను అందించడంతోపాటు వ్యాధి వివరాలను డిజిట లైజ్ చేసే సరికొత్త కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రభుత్వం, టాటా సంస్థ సంయుక్తంగా టాటా డిజిటల్ నెర్వ్ సెంటర్ (డింక్) ద్వారా ఈ సేవలను అందించే సంజీవని ప్రోగ్రామ్‌ను అమలుచేయనుంది. తొలుత సీఎం చంద్రబాబునాయుడు సొంత నియోజకవ ర్గమైన కుప్పంలో దీనిని అమలుచేయగా, మంచి ఫలితాలు వచ్చాయి. దీంతో జూన్ నుంచి రాష్ట్రమంతటా అమల్లో భాగంగా జిల్లాలోని తొమ్మిది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 66 అర్బన్ హెల్త్ సెంటర్స్‌ను ఎంపిక చేశారు. మెరుగైన సేవలందించేందుకు డీపీఎంవో, డీపీవో, ముగ్గురు మెడికల్ ఆఫీసర్లకు శిక్షణ ఇచ్చినట్టు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు.

ఆరోగ్య కేంద్రానికి రోగి వచ్చినప్పటి నుంచి తిరిగి వెళ్లే వరకు వైద్య సేవలకు సంబంధించిన ప్రతి సమాచారాన్ని ఈ ప్రోగ్రామ్‌లో భాగంగా డిజిటలైజ్ చేస్తారు. ఇందు కోసం ప్రతి కేంద్రంలో పేషెంట్ కేర్ కో-ఆర్డినేటర్ (పీసీసీ) ను నియమించనున్నారు. ఇప్పటికే విలేజ్ హెల్త్ క్లినిక్‌ల్లో పనిచేస్తున్న మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లను పీసీసీలుగా నియమించనున్నారు. అర్బన్ హెల్త్ సెంటర్స్‌లో స్టాఫ్ నర్సుల్లో ఒకరిని పీసీసీలుగా నియమిస్తారు. నియోజక వర్గస్థాయిలో ఆయా కేంద్రాలను పర్యవేక్షించేందుకు అనుగుణంగా పేషెంట్ కేర్ మేనేజర్‌ను నియమించ నున్నారు. వీరు ఆయా ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగి వివరాలను ఆన్‌లైన్ చేయడం, ఇంటికి వెళ్లిన తరువాత ఫాలోఅప్ బాధ్యతను తీసుకుంటారు. ఆస్పత్రికి వచ్చిన రోగికి అభా ఐడీ క్రియేట్ చేయడం, వివరాలను హెల్త్ ఎక్స్ సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయడం, రోగి సమస్యను బట్టి క్లినికల్, నాన్ క్లినికల్‌గా వర్గికరించి వైద్య సేవలు అందించడం, ఆస్పత్రిలో వైద్యుడు అందుబాటులో లేకుంటే వర్చువల్‌గా రాష్ట్రస్థాయిలో ఉన్న డింక్ సెంటర్ వైద్యుడితో మాట్లాడించడం, ఆరోగ్య శిబిరాలు, అపాయింట్‌మెంట్ వివరాలను రోగులకు అందిస్తారు.

నూతన విధానంలో కాగిత రహితంగా సేవలుంటాయి. ఆన్‌లైన్‌లో రోగి వివరాలను నమోదు చేయడం వల్ల ఎక్కడికి వెళ్లినా అభా ఐడీ ఎంటర్ చేయగానే రోగికి సంబంధించిన పూర్తి సమాచారం లభిస్తుంది. మెడికల్ ఆఫీసర్ వద్దకు వెళ్లిన తరువాత ఆ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. అనంతరం అవసరమైతే పరీక్షలు చేయించి ఫలితాలను సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ చేస్తారు. డాక్టర్ సూచించిన మందులను అందించిన తరువాత ఆ వివరాలను డిజిటలైజ్ చేస్తారు. రోగి ఆస్పత్రి నుంచి వెళ్లే ముందు మరోసారి పీసీసీని కలిస్తే డాక్యుమెంట్లును స్కాన్‌చేసి పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు. రిఫరల్ ఉంటే వివరాలను రోగికి చెబుతారు.

# ఏళ్ల నాటి సమస్య.. పరిష్కారమయ్యేనా?

**జియ్యమ్మవలస, పతాకం న్యూస్:** చింతలబెలగాం డీ పట్టా భూముల విషయంలో కదలిక వచ్చింది. దళితులకు న్యాయం చేసేందుకు ఉన్నతాధికారులు సిద్ధమయ్యారు. ఇటీవల ఎస్సీ కమిషన్ సభ్యుడు సీతారాం, డీవీఎంసీ మెంబరు పరిశీలించిన మీదట సీసీఎల్ఏ నుంచి కలెక్టర్, పాలకొండ సబ్ కలెక్టర్, తహసీల్దార్‌కు స్పష్టమైన ఆదేశాలు అందాయి. ఈ మేరకు చర్యలు తీసుకునే విధంగా అధికారులు పావులు కదుపుతున్నారు. మరి ఏ మేరకు చర్యలు ఉంటాయోనని దళితులు ఆశగా ఎదురు చూస్తున్నారు. వాస్తవంగా ఈ పంచాయతీలో ఉన్న దళితులకు తుమ్మలదత్తివలస రెవెన్యూలో 9 సర్వే నంబర్లలో 5.40 ఎకరాలు, చింతలబెలగాం రెవెన్యూలో 12 సర్వే నంబర్ల పరిధిలో 6.66 ఎకరాలను గతంలో అధికారులు ఇచ్చారు. అయితే ఆ గ్రామంలో ఇతర కులాలకు చెందిన 14 మంది తమ భూమిని ఆక్రమించుకుని దౌర్జన్యంగా సాగు చేసుకుంటున్నారని గత కొన్నాళ్లుగా న్యాయ పోరాటం చేస్తున్న దళితులకు కొంత ఊరట కలిగింది. దళితులకు ఇచ్చిన భూముల విషయంలో అధికారులు విచారణ చేపడుతున్నారు. దళితులకు అసైన్‌మెంట్ చేసిన డీపట్టా భూముల్లో ఇతర కులస్థులు ఆక్రమించుకుని సాగు చేసుకుం టున్నట్లుగా తొలుత తహసీల్దార్ సమగ్ర విచారణ చేయాల్సి ఉంది. ఆతర్వాత అసైన్డ్ ల్యాండ్స్ చట్టం 1977 (పీవోటీ యాక్ట్) ప్రకారం.. సదరు భూముల్లో సాగు చేయకూడదని నోటీసు బోర్డులో పెట్టాలి. ఈ చర్యలపై సబ్ కలెక్టర్‌కు సమగ్ర నివేదిక అందించాల్సి ఉంది. అయితే ఆయా భూముల్లో కొన్ని సర్వే నెంబర్లకు రిసంప్షన్ ఆర్డర్ ఇచ్చి నోటీసు బోర్డులో పెట్టినా ఆక్రమణదారులు సాగు చేస్తుండడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదిలా ఉండగా.. చింతలబెలగాం, తుమ్మలవలసలో దళితులకు అసైన్డ్ చేసిన డీపట్టా భూముల రికార్డులు తహసీల్దార్ కార్యాలయంలో లేకపోవడం గమనార్హం. అవి ఏమైపోయాయో రెవెన్యూశాఖకే తెలియాలి. ఇకపోతే రెవెన్యూ



రికార్డులను ట్యాంపరింగ్ చేసి ఆన్‌లైన్‌లో మార్పులు చేసిన అధికారులపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని దళితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో నకిలీ పత్రాలు మంజూరు చేసిన అధికారులపై కూడా చర్యలు లేవని వారు ఆరోపిస్తున్నారు.

# జనగణన పూర్తయ్యాకే డీలిమిటేషన్ చేయాలి




**విజయనగరం, పతాకం న్యూస్:** జనగణన పూర్తయ్యాకే డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) చేయాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు, పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కెఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. ఈ విషయంలో రాజకీయ ప్రయోజనాల కోసం పాలక పార్టీలు తొందరపడుతున్నాయని విమర్శించారు. చిత్తశుద్ధి ఉంటే మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలని డిమాండ్ చేశారు. విజయనగరంలో యుటిఎఫ్ ఆధ్వర్యాన నిర్మించిన శేషగిరి విజ్ఞాన కేంద్రం అత్యంత ఉత్సాహ పూరితంగా ప్రారంభమైంది. ఉపాధ్యాయ ఉద్యమనేత కోరెడ్ల శేషగిరి 5వ వర్ధంతిని పుష్కరించుకుని ఈ భవనాన్ని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ ప్రారంభించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు చింత భాస్కరరావు అధ్యక్షతన జరిగిన సభలో 'డీలిమిటేషన్ – – మహిళా బిల్లు – పరిణామాలు' అనే అంశంపై లక్ష్మణరావు స్మారకోపన్యాసం చేశారు. రాజ్యాంగం ప్రకారం మన దేశంలో లోక్‌సభ సీట్ల సంఖ్య జనగణన జరిగిన ప్రతిసారీ అందుకనుగుణంగా సవరణ చేసుకోవచ్చని అన్నారు. జనగణన పూర్తవకుండానే మోడీ ప్రభుత్వం ఏకపక్షంగా డీలిమిటేషన్ చేసేందుకు ప్రయత్నించి విఫలమైందన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ప్రస్తుతం (2026 సంవత్సరం) జనగణనతో పాటు కుల గణన కూడా జరుగుతోందని, ఇది పూర్తయ్యాక డీమిటేషన్ చేయాలని, జనాభా తక్కువగా ఉన్న దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగకుండా చూడాలని డిమాండ్ చేశారు. లేదంటే ఫెడరల్ విధానానికి భంగం కలుగుతుందని గుర్తుచేశారు. వివిధ సామాజిక వర్గాలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించేందుకు కూడా అవకాశం ఉంటుందన్నారు.

106వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా 2023లోనే ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయకుండా, డీలిమిటేషన్ బిల్లుతో ముడిపెట్టడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ యావత్తు సమాజాన్ని ప్రభావితం చేసే నూతన విద్యారంగంతోపాటు అనేక అంశాలపై శేషగిరి నిరంతరం అధ్యయనం చేసి, సభలు, సమావేశాలు, చర్చాగోష్టులు నిర్వహించి జనాన్ని చైతన్య పర్చారని కొనియాడారు. నేడు ఆయన పేరిట విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయడం మంచి పరిణామని, ఆయన ఆశయాలను కొనసాగించేందుకు కృషిచేయడమే శేషగిరికిచ్చిన నిజమైన నివాళి అని అన్నారు. ఈ సభలో యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహన్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కె శ్రీవాస్ తదితరులు ప్రసంగించారు. రాష్ట్ర నాయకులు కె విజయగౌరి, డి రాము తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా గొంతు వినిపించేందుకు మరోసారి అవకాశమివ్వండి




**భీమవరం, పతాకం న్యూస్:** శాసన మండలిలో ప్రజా గొంతు వినిపించేందుకు మరోసారి అవకాశం కల్పించాలని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి కోరారు. వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా గోపిమూర్తిని యుటిఎఫ్ మరికొన్ని సంఘాలు సంయుక్తంగా మద్దతు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో భీమవరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన పాత్రికేయుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను ఎమ్మెల్సీగా గెలిచిన తర్వాత గడిచిన 20 నెలల కాలంలో ఉభయ గోదావరి జిల్లాల్లో 110 మండలాలు, 14 మున్సిపాల్టీలు, మూడు కార్పొరేషన్లలో పర్యటించి అక్కడి పాఠశాలల సమస్యలు, ఉపాధ్యాయుల సమస్యలు తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక, సామాన్య ప్రజానీకం సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేశానని వివరించారు. సమస్యలపై శాసనమండలిలో గొంతు వినిపించడమే కాకుండా మండలి బయట కూడా సమస్యలపై పని చేశానని తెలిపారు. ముఖ్యంగా ఎనిమిది గంటల పని విధానం రద్దు, 4 లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా శాసనమండలిలో తన వాణి వినిపిపించానని చెప్పారు. పి-4లో ఉపాధ్యాయులను భాగం చేసిన నేపథ్యంలో పూర్తిగా వ్యతిరేకించి ప్రభుత్వం ఉపసంహరించుకునేలా పోరాడ మన్నారు. సోషల్ వెల్ఫేర్, ఎయిడెడ్ కళాశాలల్లో పని చేస్తున్న వివిధ రకాల లెక్చరర్ల సమస్యలపై పని చేసినట్లు చెప్పారు. అన్ ఎయిడెడ్ లెక్చరర్లను రెగ్యులర్ చేయాలని, కాంట్రాక్ట్ లెక్చరర్‌లకు జీతాలు పెంచాలని ప్రాతినిధ్యం చేశానన్నారు. పోలవరం నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని అందించాలని మండలిలో ప్రస్తావించానని తెలిపారు. బడ్జెట్ సందర్భంగా మండలిలో ఎమ్మెల్సీలకు ఇచ్చిన రూ.లక్ష గిఫ్టును తాను నిరాకరించానన్నారు. ప్రభుత్వం వైపు, ప్రతిపక్షం వైపు ఒరిగిపోకుండా నికరంగా నిలబడి ప్రజా సమస్యలపై తన గళాన్ని వినిపిపించానని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది పదో తరగతిలో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. తాను చదువుకున్న మట్లపాలెం పాఠశాల విద్యార్థికి 592 మార్కులు వచ్చాయని, ఆ విద్యార్థి జిల్లాలో ప్రభుత్వ స్కూల్స్‌లో ఫస్ట్‌లో నిలిచారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించే విధంగా విద్యార్థుల ఫొటోలతో ప్రభుత్వం ప్రచారం చేయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. 2027 ఎన్నికలో ఎమ్మెల్సీగా మరోసారి పోటీ చేసే అవకాశం లభించిందని, పూర్తి కాలం అవకాశం కల్పిస్తే అన్ని ప్రజా ఉద్యమాల్లో పాల్గొంటూ పిడిఎఫ్ పక్షాన ఉద్యమ నాయకునిగా ప్రజాగొంతును మండలిలో వినిపిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఎస్ విజయరామరాజు, పి క్రాంతికుమార్ పాల్గొన్నారు.

## 51 మంది బోధనాస్పత్రుల వైద్యులకు ఉద్వాసన

### వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్




**అమరావతి, పతాకం న్యూస్:** అనధికారికంగా విధులకు దూరంగా ఉన్న డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డిఎంఇ) పరిధిలోని 51 మంది వైద్యులను విధుల్లోంచి శాశ్వతంగా తప్పించినట్లు వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. వీరిలో 8 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 41 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఇద్దరు ట్యూటర్లు ఉన్నారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరేళ్ల నుంచి విధులకు దూరంగా ఉన్నవారు ఈ జాబితాలో ఉన్నారని తెలిపారు. ఎపి సివిల్ సర్వీసెస్ రూల్స్ నియమాలను అనుసరించి వైద్యులను విధుల్లోంచి తప్పించినట్లు వెల్లడించారు. ఏడాదికి మించి విధులకు దూరంగా ఉన్నవారిని రాజీనామా చేసినట్లుగా భావించి చర్యలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉందని తెలిపారు. అయినప్పటికీ సంజాయిషీ నోటీసులను జారీ చేసి తగిన సమయం ఇచ్చామన్నారు. తగిన స్పందన లేనందున 51 మంది వైద్యులను విధుల్లోంచి తప్పించినట్లు వెల్లడించారు. బోధనాస్పత్రుల్లో రెగ్యులర్ విధానంలో ప్రభుత్వ నోటిఫికేషన్ల అనుసరించి, విధుల్లో చేరిన వారు అనధికారికంగా డ్యూటీలకు గైర్హాజరవుతున్నారని తెలిపారు. అసోసియేట్ ప్రొఫెసర్లలో 8 మంది ఉండగా, ఆంధ్ర వైద్య కళాశాలకు చెందిన ఒకరు 2020 ఫిబ్రవరి 7 నుంచి విధులకు దూరంగా ఉన్నారన్నారు. అసోసియేట్ ప్రొఫెసర్లు 41 మంది ఉండగా, ఒకరు 2022 ఆగస్టు 22వ తేదీ నుంచి విధులకు హాజరుకావడం లేదని తెలిపారు. కడప, అనంతపురం, ఒంగోలు, తిరుపతి, విజయవాడ, కాకినాడ, విశాఖపట్నం, విజయనగరం, రాజమహేంద్రవరం, ఏలూరు, నెల్లూరు, మార్కాపురం కళాశాలలకు చెందిన వారు వీరిలో ఎక్కువగా ఉన్నట్లు తెలిపారు. ట్యూటర్లలో ఇద్దరు ఉన్నారని, ఒకరైతే ఏడేళ్ల నుంచి విధులకు దూరంగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రొఫెసర్ల కేటగిరిలో ముగ్గురు దీర్ఘకాలం నుంచి విధులకు దూరంగా ఉన్నారని, వీరి విషయంలోనూ కఠిన చర్యలు త్వరలో ఉండబోతున్నాయని వెల్లడించారు. ఐదుగురు ప్రొఫెసర్లు దీర్ఘ కాలం నుంచి విధులకు దూరంగా ఉండగా అధికారుల నోటీసుల జారీ అనంతరం ఇద్దరు విధుల్లో చేరారని తెలిపారు.

## పలు కేంద్రాల్లో సగానికిపైగా పొగాకు బేళ్ల తిరస్కరణ



**ఒంగోలు, పతాకం న్యూస్:** దక్షిణాది పొగాకు మార్కెట్లో బేళ్ల తిర స్కరణలు ఏమాత్రం ఆగడం లేదు. వేలంలో బోర్డు అధికారులు సూచించిన ధరకు కొనేందుకు బయ్యర్లు ముందుకు రాకపోవడంతో వాటిని అధికారే నోబిడ్ చేస్తున్నారు. అలాంటివి వేలానికి వచ్చిన బేళ్లలో దాదాపు 35 నుంచి 40శాతం ఉన్నాయి. మరో పదిశాతం వరకు ఇతర పలు కారణాలతో తిరస్కరణలు జరిగాయి. మూడు జిల్లాల పరిధిలో ఉన్న 11వేలం కేంద్రాలకు బుధవారం అమ్మకాలకు 3,843 బేళ్లను రైతులు తీసుకువచ్చారు. వాటిలో 2,106 బేళ్లను మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేశారు. వివిధ రకాల కారణాలతో 1,737 తిరస్కరించారు. అంటే అమ్మకాలకు తెచ్చిన వాటిలో సుమారు 45.20శాతం వ్యాపారులు కొనుగోలు చేయక రైతులు తిరిగి ఇళ్లకు తీసుకెళ్లాల్సి వచ్చింది. తిరస్కరణలు జరిగిన వాటిలో అధికారులు సూచించిన ధరకు బయ్యర్లు కొనుగోలు చేయక నోబిడ్ అవుతున్నవి గణనీయంగా ఉంటున్నాయి. బుధవారం నాటి వేలం ప్రక్రియలో తిరస్కరణలు జరిగిన 1,737లో 1,453 నోబిడ్‌లు ఉండటం మార్కెట్ పరిస్థితిని తెలియజేస్తోంది. మొత్తంగా వేలానికి వచ్చిన బేళ్లలో నోబిడ్‌లు దాదాపు 38శాతం ఉన్నాయి. ఇదిలాఉండగా పలు కేంద్రాల్లో కొన్న వాటి కన్నా తిరస్కరించినవే అధికంగా కనిపించాయి. ఎస్‌బీఎస్ రీజియన్‌లోని ఒంగోలు-1లో 55శాతం, వెల్లంపల్లిలో 51శాతం తిరస్కరణలు ఉన్నాయి. ఎస్‌ఎల్‌ఎస్ రీజియన్‌లోని కందుకూరు-1లో ఏకంగా 62.54శాతం, కనిగిరిలో 56.48శాతం, కందుకూరు-2లో 54శాతం, పొదిలిలో 53శాతం తిరస్కరణలు జరిగాయి. గత రెండురోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతుండటంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.


## జ్వరంతో గిరిజన బాలిక మృతి

**పశ్చిమ గోదావరి, పతాకం న్యూస్:** బుట్టాయగూడెం మండలంలోని కోర్సావారిగూడేంకు చెందిన గిరిజన బాలిక కారం సంగీత (8) జ్వరంతో బాధపడుతూ మృతి చెందింది. డిప్యూటీ డీఎంహెచ్‌వో జె.సురేష్‌కుమార్ తెలిపిన వివరాలివి. కారం వెంకటేష్, పుష్ప దంపతుల కుమార్తె సంగీత గురుగుమిల్లి ఎంపీపీ పాఠశాలలో 3వ తరగతి చదువుతోంది. ఆమె జ్వరం బారినపడడంతో ఏప్రిల్ 30న దొరమామిడి ప్రాథ మిక ఆరోగ్య కేంద్రానికి తీసు కెళ్లగా వైద్యులు రక్తపరీక్షలు చేసి సాధారణ జ్వరంగా గుర్తించి మందులు ఇచ్చి ఇంటికి పంపారు. జ్వరం తగ్గకపోవడంతో తల్లిదండ్రులు గ్రామంలోని ఆర్ఎంపీకి చూపించగా మే 1 నుంచి 4 తేదీ వరకు అనుమతిలేని తన ప్రాథమిక వైద్య కేంద్రంలో బాలికకు వైద్యం అందించాడు. పరిస్థితి విషమించడంతో వేరే ఆసుపత్రికి వెళ్లాలని సూచించడంతో మార్గమధ్యలో బాలిక మరణించింది.

# దంత సమస్యలను ఏలా పరిష్కరించుకోవాలి?

ఓరల్ ప్రాబ్లమ్స్‌తో ప్రపంచవ్యాప్తంగా దాదాపు 350కోట్ల మంది ప్రజలు బాధపడుతున్నారని గ్లోబల్ ఓరల్ హెల్త్ స్టేటస్ రిపోర్ట్ లో వెల్లడైంది. ముఖ్యంగా వెనుకబడిన దేశాల్లో నలుగురిలో ముగ్గురు దంత సంబంధిత సమస్యల బారిన పడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా 200 కోట్లమంది ప్రజలు దంతాల క్షయంతో ఇబ్బంది పడుతున్నారు. 51.4 కోట్ల మంది పిల్లలు ప్రాథమిక దంత క్షయంతో బాధపడుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. శరీరానికి కావలసిన శక్తి చక్కగా అందా లంటే దంతాలను ఆరోగ్యంగా ఉంచుకోవాలి. ఇదేంటి శరీరానికి శక్తి అందడానికి, పండ్లకు సంబంధం ఏమిటీ అనుకుంటున్నారా..? ఔను దంతాలు మంచిగా ఉంటేనే కదా ఆహారాన్ని చక్కగా నమిలి మింగగలిగేది. బాగా నమిలినప్పుడే కదా..? ఆహారం జీర్ణమవ్వడానికి సిద్ధమయ్యేది. అలా ఆహారం జీర్ణమైనప్పుడే కదా శక్తి విడుదలయ్యేది. అప్పుడే కదా ఆరోగ్యంగా ఉండి దైనందిన కార్యక్రమాలను నిర్వర్తించగలుగుతాం. కాబట్టి దంతాలను మనం ఎంత ఆరోగ్యంగా ఉంచుకుంటే అంత ఆరోగ్యంగా ఉంటాము. చర్మ సంరక్షణ కోసం చేయాల్సినవి .. చేయకూడని పనులను గురించి తెలుసుకుందాం..!

చూడటానికి, తెల్లగా, గట్టిగా ఉండే దంతాలను సంరక్షించుకుంటేనే అవి ఎక్కువ కాలం ఆరోగ్యంగా ఉంటాయి. వీటి సంరక్షణ ఆవశ్యకత అర్థం కావాలంటే ముందు వాటి నిర్మాణంపై అవగాహన అవసరం. దంతంపై భాగం ఎనామిల్ అనే పదార్థంతో ఏర్పడుతుంది. ఎనామిల్ తర్వాత డెంటిన్ అనే



మరో పొర ఉంటుంది. డెంటిన్ తరువాత పల్ప్ కనిపిస్తుంది.

ప్రతి దంతానికి దవడలో మూలం ఉంటుంది. ఎన్ని పండ్లుంటే అన్ని మూలాలు దవడ ఎముకలో ఉంటాయి. ఈ దంతాల చుట్టూ చిగురు ఆవరించి ఉండి సిమెంట్ లాగా పనిచేస్తుంది. చిగుళ్లు ఎంత ఆరోగ్యంగా ఉంటే దంతాలు కూడా అంత గట్టిగా ఉంటాయి. వాటిని జాగ్రత్తగా చూసుకోకపోతే వాచిపోయి దుర్వాసన వస్తుందని వైద్యులు చెబుతున్నారు.

ఎదుటివాళ్లతో మాట్లాడేటప్పుడు మన నోటి నుంచి భరించలేని వాసన వస్తుంది. ఫలితంగా చాలామంది మనల్ని తప్పించుకుని తిరిగే ప్రమాదమూ ఉంటుంది. చిగుళ్ల వాపువల్ల రక్తస్రావం కూడా కలుగుతుంది. ఇంకా నిర్లక్ష్యం చేస్తే దంతాలు కదలడం ప్రారంభమవుతుంది. దంతాలు వచ్చినా, రాకపోయినా శిశువులు పాలు తాగిన తర్వాత నోరంతా శుభ్రంగా కడగాలి. వేలితో చిగుళ్లను మర్దన చేయాలి. పాల సీసా పీకను నోట్లోనే ఉంచి నిద్రపుచ్చకూడదు. ఏదైనా తిన్న తర్వాత పుక్కిలించి ఊయడం, నోటిని శుభ్రం గా కడుక్కోవడం వంటి పనులను పిల్లలకు అలవాటు చేయాలి. పిల్లలకు శాస్త్రీయంగా ఎలా పండ్లు తోమాలో తల్లిదండ్రులే దగ్గరుండి నేర్పించాలి.

కిందిపండ్లు పైకి, పై పండ్లు కిందికి బ్రష్ చేయాలి. పెద్దలు వాళ్లు కూడా బ్రష్‌ని ప్రతి మూడు నెలలకోసారి మార్చాలి. పంటి నొప్పి లేదా చిగురు వాపు వస్తే దంతానికి జిందూబామ్ లేదా అమృతాంజన్ వంటివి రాయకూడదు. పంటి సందుల్లో పుల్లలు, పిన్నీసులు వంటివి పెట్టి కెలకకూడదు. పాన్, గుట్కా ఇతర పొగాకు ఉత్పత్తులను నమలకూడదు. గరుకైన పొడులను, గట్టిగా ఉండే బ్రష్‌లను దంతాలు శుభ్రంచేయడానికి ఉపయోగించకూడదు. అతి చల్లగా కానీ లేదా అతి వేడిగా ఉండే పదార్థాలను, పానీయాలను పంటికి తగలకుండా జాగ్రత్తపడితే మంచిది. దంతాలకు వైద్యం చేయించు కుంటే చూపు మందగి స్తుందని చాలామంది అనుకుంటూరు. ఇది పెద్ద అపోహ.. పంటి నరాలకు, కంటి నరాలకు సంబంధమే లేదు. దంతాలు పుచ్చిపోవడానికి పురుగులు కారణం అనుకుంటూరు. అది కూడా తప్పే. దంతాలు పుచ్చిపోవడానికి అసలు కారణం సూక్ష్మజీవులు. దంతాలను, చిగుళ్లను అన్ని వైపులా శుభ్రంచేసుకోక పోవడం వల్ల నోటి దుర్వాసన వస్తుంది. మనం తిన్న ఆహారం పండ్లలో ఇరుక్కుపోయి కుళ్లిపోయి దంత సమస్యలు వస్తాయి. అందుకే చిగుళ్లు వాయడం, రక్తంకారడం జరుగుతుంది.

పళ్లు పుచ్చిపోవడం మరో సమస్య. దంతాల పుచ్చు ను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స చేయించుకోవాలని వైద్య నిపుణులు వెల్లడిస్తున్నారు. మధుమేహం ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండకపోతే మరింత ప్రమాదం. కాబట్టి దంత సంరక్షణలో అవసరమైన జాగ్రత్తలు పాటించి ఆగ్యంగా ఉండండాలని డెంటిస్టులు సూచిస్తున్నారు.

# తారకరామ తీర్థసాగర్ నిర్వాసితుల ఆవేదన



**నెల్లిమర్ల, పతాకం న్యూస్:** తారకరామ తీర్థసాగర్ రిజర్వాయర్‌కు సంబధించి ఏటి.అగ్రహారం, కోరాడపేటను ముంపు గ్రామాలుగా తొలుత ప్రకటించిన అధికారులు వారి కోసం నిర్వాసిత గ్రామం ఏర్పాటుకు ఇప్పటికీ చర్యలు తీసుకోలేదు. వారి భూములను స్వాధీనం చేసుకొని ఉపాధి అంశాన్ని వదిలేశారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీని వర్తింప చేయలేదు. నిర్వాసిత గ్రామాల గురించి కానీ, వారి ఇళ్లు, చెట్లు, పశుసంపదకు కాని నష్టపరిహారం పంపిణీ చేయలేదు. పదేళ్ల క్రితం రామతీర్థసాగర్ రిజర్వాయర్‌ను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. తొలుత దన్నానపేట గ్రామ పంచాయతీ పరిధిలోని కోరాడపేట గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించింది. ఆ తరువాత మరో రెండేళ్లకు పక్కనే ఉన్న అత్మారాముని అగ్రహారం గ్రామాన్ని కూడా ముంపు గ్రామంగా ప్రకటిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఇదే మండలంలోని సారిపల్లి గ్రామ భూములు కూడా రిజర్వాయర్‌లో కలిశాయి. ఈ మూడు గ్రామాలకు సంబంధించి దాదాపు 90 శాతం భూములకు నష్టపరిహారం పంపిణీ చేశారు. మరో 10 శాతం భూములకు కుటుంబ తగాదాలు, రికార్డుల సమస్య, కోర్టు ఉత్తర్వులు తదితర కారణాల వల్ల చెల్లింపులు నిలిచిపోయాయి. ముంపు గ్రామాల్లో పల్లం భూమి ఎకరాకు రూ.1.75 లక్షలు, మెట్ట భూమికి రూ.1.5 లక్షలుగా ప్రభుత్వం ఖరారు చేసింది. ఇంకా కోట్లాది రూపాయల పరిహారం నిర్వాసితులకు పంపిణీ చేయాల్సి ఉంది. యంత్రాంగంలో చలనం లేక ఐదేళ్లుగా ఎలాంటి మార్పులు లేవు.

ముంపు గ్రామాల అసలు సమస్య నిర్వాసిత గ్రామాల నిర్మాణం. తారకరామతీర్థసాగర్ రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా ఎనిమిదేళ్ల క్రితం కోరాడపేట, వీటీ.అగ్రహారం గ్రామాలను ముంపు గ్రామాలుగా ప్రభుత్వం అధికారికంగా ప్రటించినప్పటికీ ఇంతవరకు వారికి నిర్వాసిత గ్రామాలను ఎక్కడా నిర్మించలేదు. కనీసం దీనిపై అధికారులు ఒక నిర్ణయానికి కూడా రాకపోవడం విచిత్రం. కోరాడపేట గ్రామస్థులకు నెల్లిమర్ల ఫ్లైఓవర్ వంతెన సమీపంలో నిర్వాసిత గ్రామం నిర్మాణానికి సర్వే నెంబరు 58లో 16.69 ఎకరాలను కేటాయించారు. ఆ స్థలాన్ని ఇంతవరకు చదును చేయడం కాని, ప్లాట్లుగా వేసి లబ్ధిదారులకు కేటాయించడం కానీ జరగలేదు. ఏటీ.అగ్రహారం గ్రామస్థులకు ఇంతవరకు స్థలం కూడా ఎంపిక చేయలేదు.

ప్రధానంగా ముంపు గ్రామాల్లో కోరాడపేటలో 200 ఎకరాలు, ఏటీ.అగ్రహారంలో 450 ఎకరాలు రిజర్వాయర్ కింద కలిసిపోయాయి. వీటికి సంబంధించి దాదాపు 90 శాతం నష్టపరిహారం చెల్లింపులు పూర్తయినప్పటికీ గ్రామాల్లో ఇప్పటికే నివసిస్తున్న వారి ఇళ్లకు, భవనాలకు, పశువులశాలలకు, ఫలసాయం ఇస్తున్న చెట్లకు నష్టపరిహారం చెల్లించలేదు. దీనిపై గతంలో నీటిపారుదల శాఖాధికారులు సర్వే చేసినప్పటికీ గ్రామస్థులు సంతృప్తి చెందలేదు. సర్వే సక్రమంగా జరగలేదని పెదవి విరుస్తున్నారు. రోడ్లు, భవనాల శాఖ అధికారులతో రీసర్వే చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కోరాడపేటలో 184 ఇళు ఉండగా, ఏటీ అగ్రహారంలో 500 ఇళ్లతోపాటు 140 పశువుల శాలలు ఉన్నాయి. వీటితోపాటు నిర్వాసిత కుటుంబాలకు జీవనభృతి కింద ఒక్కో కుటుంబానికి ఏడాదికి రూ.1.08 లక్షలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. దీనిపై అధికారులు ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అలాగే 18 సంవత్సరాలు నిండిన యువకులకు ప్రత్యేక భృతి చెల్లించాల్సి ఉంది. గ్రామాన్ని వదిలి నిర్వాసిత గ్రామానికి తరలిపోయేందుకు రవాణాభత్యంతోపాటు కొత్త గ్రామం నిర్మాణం, స్థలం కేటాయింపు, ఇళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాల్సి ఉంది.

## హిజ్బుల్లా కమాండర్‌ని హతమార్చిన ఇజ్రాయిల్ సైన్యం



**బీరూట్ :** బీరూట్ దక్షిణ శివారు ప్రాంతాలపై బాంబు దాడులు చేసి హిజ్బుల్లా రాద్వాన్ ఫోర్స్ కమాండర్ మాలెక్ బలూను హతమార్చినట్లు ఇజ్రాయిల్ దళాలు గురువారం ప్రకటించాయి. అయితే దీనిపై హిజ్బుల్లా ఇంతవరకు స్పందించలేదు. ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు, రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ ఇజ్రాయిల్ సైన్యం దాడి గురించి బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో ప్రకటించారు. లెబనాన్ రాజధాని బీరూట్ దక్షిణ శివారు ప్రాంతాల్లోని ఘోబేరిని (పురపాలక సంఘ కార్యాలయాన్ని) లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు దాడి చేశాయి అని లెబనాన్ ప్రభుత్వ ఆధ్వర్యంలోని నేషనల్ న్యూస్ ఏజెన్సీ నివేదించింది. దాడులు చేసినప్పుడు ఈ ప్రాంతంలో పెద్ద పెద్ద శబ్దాలు వినిపించాయని..ఈ దాడుల వల్ల భారీ నష్టం వాటిల్లిందని న్యూస్ ఏజెన్సీ వెల్లడించింది. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ స్థావరాలపై కాల్పులు జరపడం, ఇజ్రాయెల్ సైనికులను గాయపరచడం వంటి వాటికి రద్వాన్ ఉగ్రవాదులే బాధ్యులు. ఏ ఉగ్రవాదికీ మినహాయింపు లేదు. ఇజ్రాయెల్ తన సుదీర్ఘ హస్తంతో ప్రతి శత్రువును, హంతకుడిని పట్టుకుంటుంది అని నెతన్యాహు టెలిగ్రామ్‌లో ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. కాగా, ఇజ్రాయిల్ లెబనాన్‌పై చేస్తున్న వరుస దాడులకు పాల్పడుతోంది. కాల్పుల విరమణ ఉన్నప్పటికీ ఇజ్రాయెల్ దళాలు లెబనాన్ దక్షిణ, తూర్పు ప్రాంతాలపై దాడులు కొనసాగించాయి. ఈ దాడుల్లో బుధవారం కనీసం 13 మంది మరణించారు. లెబనాన్‌లోని తూర్పు బెకా లోయలో ఇజ్రాయెల్ జరిపిన దాడిలో నలుగురు మరణించారు. ఇక మార్చి 2 నుంచి లెబనాన్‌లో ఇజ్రాయిల్ సైన్యం జరిపిన దాడుల వల్ల 2,700 మందికిపైగా మరణించారు.

## దక్షిణ కొరియా నౌకపై దాడిలో సైన్యం పాత్రను ఖండించిన ఇరాన్

**ఇరాన్:** హర్మూజ్ జలసంధిలో దక్షిణ కొరియా నౌకపై జరిగిన దాడిలో తమ సైన్యం ప్రమేయం ఉందన్న ఆరోపణలను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. దక్షిణ కొరియాకు చెందిన ఒక సరుకు రవాణా నౌకపై ఇరాన్ కాల్పులు జరిపిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన సోషల్ మీడియా -ట్రూత్'లో ఆరోపించిన సంగతి తెలిసిందే. ఈ ఆరోపణలను తిరస్కరిస్తూ దక్షిణ కొరియాలోని ఇరాన్ రాయబార కార్యాలయం గురువారం ఒక అధికారిక ప్రకటనను విడుదల చేసింది.




## బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ షెడ్యూల్‌ను ప్రకటించిన ఆస్ట్రేలియా



భారత్-ఆస్ట్రేలియా మధ్య జరిగే ప్రతిష్ఠాత్మక బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ-2027కు సంబంధించిన షెడ్యూల్‌ను క్రికెట్ ఆస్ట్రేలియా ప్రకటించింది. ఐదు మ్యాచ్‌ల ఈ టెస్ట్ సిరీస్ కోసం ఆస్ట్రేలియా భారత్‌లో పర్యటించనుంది. వచ్చే ఏడాది జనవరి 21న తొలి టెస్ట్ నాగ్‌పూర్ వేదికగా జరుగనుంది. అనంతరం రెండో టెస్టు జనవరి 29 నుంచి ఫిబ్రవరి 2 వరకు చెన్నై వేదికగా జరగనుంది. ఫిబ్రవరి 11 నుండి 15 వరకు గువహటి వేదికగా మూడో టెస్ట్.. ఫిబ్రవరి 19 నుంచి రాంచీ వేదికగా నాలుగో టెస్ట్ జరగనుంది. ఇక ఐదో టెస్ట్ ఫిబ్రవరి 27 నుంచి అహ్మదాబాద్ వేదికగా జరుగుతుంది. కాగా, బోర్డర్? గవాస్కర్ ట్రోఫీ 2027 తేదీల ప్రకటనతో పాటు భారత పర్యటనలోని మరిన్ని సిరీస్‌ల వివరాలను కూడా ఆస్ట్రేలియా క్రికెట్ బోర్డు ప్రకటించింది. బీజీటీ 2027కు ముందు ఆస్ట్రేలియా-ఏ జట్టు భారత-ఏ జట్టుతో మల్టీ ఫార్మాట్ సిరీస్ ఆడనుంది.

## ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన సన్‌రైజర్స్ హైదరాబాద్..




ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన సన్‌రైజర్స్ హైదరాబాద్.. టాప్‌నకు దూసుకెళ్లింది. క్లాసెన్ (43 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లతో 69), ఇషాన్ కిషన్ (32 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లతో 55) అర్ధ శతకాలతోపాటు బౌలర్లు సమష్టిగా చెలరేగడంతో ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ 33 పరుగుల తేడాతో పంజాబ్ కింగ్స్‌ను చిత్తు చేసింది. ఈ విజయంతో మొత్తం 14 పాయింట్లు సాధించిన సన్‌రైజర్స్ టాప్ లేపగా.. వరుసగా మూడో ఓటమితో పంజాబ్ రెండో స్థానానికి జారింది. తొలుత సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 235/4 స్కోరు చేసింది. నితీశ్ కుమార్ (29 నాటౌట్) రాణించాడు. అర్ష్‌దీప్, చాహల్, ఫెర్గూసన్ తలో వికెట్ దక్కించుకొన్నారు. ఛేదనలో పంజాబ్ ఓవర్లన్నీ ఆడి 202/7 స్కోరు మాత్రమే చేసింది. కూపర్ కనోలీ (107 నాటౌట్) శతకం సాధించాడు. కమిన్స్, శివాంగ్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. కమిన్స్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. లక్ష్యం కోసం బరిలోకి దిగిన పంజాబ్ ఘోరంగా తడబడింది. కూపర్ మినహా మిగతా బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఓపెనర్లు ప్రియాన్స్ ఆర్య (1), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (3)తోపాటు కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ (5) సింగిల్ డిజిట్‌కే వెనుదిరగడంతో.. పంజాబ్ 23/3తో పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో కూపర్, స్టాయినిస్ (28) నాలుగో వికెట్‌కు 40 పరుగుల భాగస్వామ్యంతో ఇన్నింగ్స్‌ను గాడిలోపెట్టే ప్రయత్నం చేశారు. అయితే, స్టాయినీ?సను శివాంగ్ అవుట్ చేసి దెబ్బకొట్టాడు. సాధించాల్సిన రన్‌రేట్ పరుగుతున్న తరుణంలో సూర్యాంశ్ (25)తో కలసి కూపర్ స్కోరు బోర్డును నడిపించే బాధ్యత తీసుకొన్నాడు. పరుగుల వేగం పెరుగుతున్న తరుణంలో సూ ర్యాంశ్‌ను అవుట్ చేసిన కమిన్స్.. ఐదో వికెట్‌కు 47 పరుగుల భాగస్వామ్యాన్ని విడదీశాడు. శశాంక్ (4) కూడా విఫలం కావడంతో పంజాబ్ పరాజయం లాంఛనమే అయింది. అయితే, కూపర్, యాన్సెన్ (19) ఏడో వికెట్‌కు 68 పరుగులు జోడించి ఓటమి అంతరాన్ని తగ్గించారు. చివరి ఓవర్‌లో యాన్సెన్‌ను శివాంగ్ అవుట్ చేసినా.. కూపర్ సిక్స్‌తో శతకం పూర్తి చేసుకొన్నాడు.

టాపార్డర్ బ్యాటర్లు దుమ్మురేపడంతో.. సన్‌రైజర్స్ భారీ స్కోరు చేసింది. పంజాబ్ ఫీల్డింగ్ వైఫల్యాలు కూడా ప్రత్యర్థి పుంజుకొనేందుకు అవకాశాలు కల్పించాయి. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్‌కు ఓపెనర్లు అభిషేక్ శర్మ (35), ట్రావిస్ హెడ్ (38) తొలి వికెట్‌కు 54 పరుగులతో అదిరే ఆరంభాన్నిచ్చారు. రెండో ఓవర్‌లో యాన్సెన్ బౌలింగ్‌లో రెండు సిక్స్‌లు, రెండు ఫోర్లు బాదిన అభిషేక్ 21 పరుగులు రాబట్టాడు. అయితే, నాలుగో ఓవర్‌లో ఫెర్గూసన్ బౌలింగ్‌లో సిక్స్ బాదిన అభిషేక్.. ఆ తర్వాతి బంతికి క్యాచౌటయ్యాడు. వన్‌డౌన్‌లో వచ్చిన కిషన్ కూడా బ్యాట్ ఝుళిపించడంతో.. పవర్‌ప్లేను హైదరాబాద్ 79/1తో ముగించింది. ఏడో ఓవర్‌లో హెడ్‌ను అవుట్ చేసిన చాహల్ దెబ్బకొట్టాడు. దీంతో రెండో వికెట్‌కు 30 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఈ దశలో కిషన్, క్లాసెన్ మూడో వికెట్‌కు 88 పరుగులు జోడించి.. జట్టును ఆదుకొనే ప్రయత్నం చేశారు. చాహల్ బౌలింగ్‌లో పంజాబ్ ఫీల్డర్లు క్యాచ్‌లను చేజార్చడంతో.. బతికిపోయిన వీరిద్దరూ మిడిల్ ఓవర్లలో నిలకడగా స్కోరు బోర్డును నడిపించారు. కాగా, వైశాక్ వేసిన 14వ ఓవర్‌లో గేర్ మార్చిన ఇషాన్ హ్యాట్రిక్ సిక్స్‌లతో అర్ధ శతకం పూర్తి చేసుకొన్నాడు. కానీ, ఆ తర్వాతి ఓవర్‌లోనే అర్ష్‌దీప్ బౌలింగ్‌లో పెవిలియన్ చేరాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన నితీశ్.. డెత్ ఓవర్లలో దూకుడుగా ఆడగా.. ఫిఫ్టీ పూర్తి చేసుకొన్న క్లాసెన్ చక్కని సహకారం అందించాడు. వీరిద్దరూ 32 బంతుల్లో 63 పరుగులు జోడించడంతో.. సన్‌రైజర్స్ స్కోరు 230 దాటింది. కానీ, ఆఖరి బంతికి క్లాసెన్‌ను వైశాక్ అవుట్ చేశాడు.




# జూన్ 4న థియేటర్లలో 'పెద్ది'



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా నటిస్తోన్న రూరల్ యాక్షన్ డ్రామా 'పెద్ది' . 'ఉప్పెన' ఫేమ్ బుచ్చి బాబు సానా దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు భారీ స్థాయిలో ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇప్పటికే చార్ట్ బస్టర్ పాటలు, అద్భుతమైన గ్లింప్స్‌తో సినిమాపై అంచనాలు భారీ స్థాయికి చేరుకున్న విషయం తెలిసిందే. ఈ చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలయ్యేందుకు సిద్ధమవుతోంది. మరోవైపు మేకర్స్ ప్రమోషన్స్ స్టార్ట్ చేశారు. అందులో భాగంగా ప్రొడక్షన్ డిజైనర్ అవినాష్ కొల్లా మీడియాకు సినిమా విశేషాలను తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ.. "నా పదేళ్ల కెరీర్‌లో ఒక కథకి ఇంతలా ఎక్సైట్ అవ్వడం నిజంగా ఇదే ఫస్ట్ టైమ్. డైరెక్టర్ కథ చెప్పిన తర్వాత దాదాపు 20 నిమిషాల పాటు నేను మనిషిని కాలేకపోయాను. అంతలా ఈ కథ నన్ను కదిలించింది. కథలోనే ఇంత బలం ఉంది కాబట్టి ప్రొడక్షన్ డిజైన్ పరంగా అన్ని విషయాల్లో చాలా కేర్ తీసుకోవాలని అప్పుడే డిసైడ్ అయ్యాను. ఒక సినిమాకు సెట్ వేసినప్పుడు అది ఆడియన్స్‌కి సెట్ అని తెలియకూడదు. అప్పుడే ఒక ఆర్ట్ డైరెక్టర్ సక్సెస్ అయినట్టు. నా వరకు ఈ సినిమాకి వేసిన సెట్స్‌ను ప్రేక్షకులు అవి సెట్స్ అని గ్రహించలేరు. అంత నేచురల్‌గా ఉంటాయి. ఇది 70-80లలో జరిగే కథ. ఇంతకు ముందు నేను పీరియడ్ సినిమాలు చేశాను. ఆ అనుభవం నాకు చాలా ఉపయోగపడింది. 'పెద్ది' విజయనగరం ఏరియాలో జరిగే కథ. అక్కడి వీధులు, క్లాక్ టవర్ ఇవన్నీ కూడా సినిమాలో రీ క్రియేట్ చేశాం. విజయనగరం చుట్టుపక్కల ప్రాంతాల డిజైన్ విషయంలో చాలా కేర్ తీసుకున్నాం. అలాగే కుస్తీ, క్రికెట్ ఆటల విషయానికి వస్తే.. ఇందులో ఇప్పటివరకు ఎవరూ చూడని కుస్తీ సెటప్ చేశాం. దానికోసం అండర్‌గ్రౌండ్ సెటప్‌లో షూట్ చేశాం. చరణ్ గదతో కనిపించిన షాట్ అక్కడే చేశాం. డీవోపీ, ఆర్ట్ డైరెక్టర్.. ఒక సింక్‌లో ఉంటే సినిమా ఖచ్చితంగా పర్ఫెక్ట్‌గా వస్తుంది. ఇందులో అలాంటి మంచి సింక్ కుదిరింది. రత్నవేలుతో పని చేయడం చాలా ఆనందంగా అనిపించింది. మంచి కోఆర్డినేషన్‌తో ఈ సినిమాకు వర్క్ చేశాం. ఈ సినిమా 'లగాన్'లా ఉండదు. 'లగాన్' బ్రిటిష్ కాలంలో జరిగిన కథ. ఇది 70-80 మధ్యలో విజయనగరం బ్యాక్‌డ్రాప్‌లో ఉండే కథ. మీరు క్రికెట్ చూస్తున్నప్పుడు మన ఊరిలో పొలాల గట్ల మీద కూర్చుని క్రికెట్ చూస్తే ఎలాంటి ఫీలింగ్ ఉంటుందో.. అంత నేచురల్ ఫీలింగ్ క్యారీ అవుతుంది. ఈ సినిమాకు ఏడాదికిపైగానే ప్రీ ప్రొడక్షన్ చేశాం. ఈ సినిమాకి వేసిన ప్రతి సెట్‌ను కూడా ఓపెన్ గ్రౌండ్‌లోనే వేశాం. అలాగే నేచురల్ లైట్‌లోనే తీశాం. ఇందులో ఒక హిల్ స్టేషన్ ఊరు కావాలి. అది హైదరాబాద్‌లోని ఒక బూత్ బంగ్లాలో వేశాం. మీరు సినిమా చూస్తున్నప్పుడు అది ఒక కొండ కింద ఉన్న ఊరిలా అనిపిస్తుంది. ఆ సెట్ వేయడం మాత్రం చాలా ఛాలెంజింగ్‌గా అనిపించింది. డైరెక్టర్ బుచ్చిబాబు, నేను మంచి కోఆర్డినేషన్‌తో వర్క్ చేశాం. ఇందులో చెరుకు ఫ్యాక్టరీ ఉంటుంది. అది కూడా సెట్. కాకపోతే అందులో బ్యూటీ ఏంటంటే మీరు ఒక్కటీ కూడా సెట్ అని పసిగట్టలేరు. కొత్త సినిమాలు మొత్తంగా 'పెద్ది' కోసం స్క్రాచ్ నుంచి వేసిన సెట్స్ 24 ఉంటాయి. అలా కాకుండా సెటప్స్ అయితే దాదాపు 60-70 పైగానే ఉంటాయి. నార్మల్ సినిమా అయితే మనం ఎక్కడైనా షూట్ చేసుకోవచ్చు. ఇంత పెద్ద స్టార్ కాస్ట్‌తో వెళ్లి షూట్ చేయడం మామూలు విషయం కాదు. లోకేషన్స్ మన కంఫర్ట్‌లో పెట్టుకుంటేనే షూట్ చేయగలుగుతాం. విజయనగరం సెట్ వేసి దాదాపు ఏడాది అవుతుంది. ఎప్పుడంటే అప్పుడు షూట్ చేసుకోవడానికి వీలుగా ఉంటుంది. అన్ని వెదర్ కండిషన్స్‌కు అనుకూలంగా ఉండేలా ఆ సెట్ వేసాం. ఇందులో హీరో వాడే బ్యాట్ కూడా చాలా నేచురల్ ప్రొడక్షన్ డిజైన్ నుంచి వచ్చింది. ఒక దేశీ ఆటగాడు తనకు దొరికే ముడిసరుకులతో బ్యాట్‌ని ఎలా తయారు చేసుకుంటాడో.. ఆ బ్యాట్ కూడా అంతే నేచురల్‌గా డిజైన్ చేశాం. అలాగే తనకు ఒక మేనరిజం ఉంటుంది. అవన్నీ కూడా అందులో రూపొందించడం జరిగింది. ఇందులో నేను వేసిన ప్రతి సెట్‌ని చరణ్ అప్రిషియేట్ చేశారు. ట్రైన్ సెటప్, స్పెషల్ సాంగ్ సెట్, కుస్తీ... ఇలా ప్రతి సెట్ ఆయనకి ఎంతగానో నచ్చాయి. చరణ్‌ని కలవడానికి వచ్చిన చాలామంది కూడా సెట్స్ చాలా నేచురల్‌గా ఉన్నాయని చెప్పారు. యాక్షన్ సీక్వెన్స్ కుస్తీ సమయంలో చరణ్‌కు గాయమైంది అయింది. అలాంటి కండీషన్‌లో కూడా చరణ్ వెంటనే మళ్లీ షూటింగ్‌లోకి వచ్చారని తెలిపారు.

# జాన్వీ కపూర్ పెళ్లిపై తండ్రి స్పందన



ప్రముఖ బాలీవుడ్ నటి జాన్వీ కపూర్, వ్యాపారవేత్త శిఖర్ పహారియాల పెళ్లిపై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారానికి నిర్మాత బోనీ కపూర్ తెరదించారు. జాన్వీ ప్రస్తుతం పెళ్లి చేసుకునే ఉద్దేశంలో లేదని, వస్తున్న వార్తలన్నీ పుకార్లేనని ఆయన తేల్చి చెప్పారు. వీరిద్దరూ గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో లేదా తిరుమల శ్రీవారి సన్నిధిలో వివాహం చేసుకోబోతున్నారంటూ కొంత కాలంగా నెట్టింట పెద్ద ఎత్తున వార్తలు హల్చల్ చేస్తున్నాయి. ఈ తరుణంలో బోనీ కపూర్ ఇచ్చిన క్లారిటీతో ఈ పుకార్లకు ప్రస్తుతానికి బ్రేక్ పడినట్లయింది. వ్యక్తిగత విషయాలను పక్కన పెడితే, జాన్వీ కపూర్ తన కెరీర్‌లో అత్యంత కీలక దశలో ఉన్నారు. ముఖ్యంగా టాలీవుడ్‌లో వరుస ప్రాజెక్టులతో ఆమె బిజీగా గడుపుతున్నారు. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సరసన ఆమె నటిస్తున్న భారీ చిత్రం 'పెద్ది'పై సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా 20 26 జూన్ నెలలో ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. శిఖర్ పహారియాతో తనకున్న బంధం గురించి గతంలో మాట్లాడిన జాన్వీ, అతని ఉనికి తనకు ఎంతో ధైర్యాన్ని మరి యు భద్రతను ఇస్తుందని ఎమోషనల్ అయ్యారు. ప్రస్తుతం ఆమె తన పూర్తి దృష్టిని సినిమాలపైనే కేంద్రీకరించినట్లు అర్థమవుతోంది.






# తెలుగబ్బాయినే పెళ్లి చేసుకుంటా: పాయల్

హైదరాబాద్‌కు చెందిన తెలుగు అబ్బాయినే పెళ్లి చేసుకుంటానని అన్నారు హీరోయిన్ పాయల్. ఇక్కడ పాయల్ అనగానే అంతా 'ఆర్ఎక్స్ 100' పాయల్ రాజ్‌పుత్ అనుకుంటారేమో.. ఆమె కాదు. ఇటీవల వచ్చిన 'పాపం ప్రతాప్' సినిమాలో హీరోయిన్‌గా నటించిన పాయల్ రాధాకృష్ణ. త్రిగుణ్ హీరోగా, పాయల్ రాధాకృష్ణ హీరోయిన్‌గా.. అనీష్ కురువిల్లా ప్రధాన పాత్రలో నటించిన ఫన్ ఫిల్డ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రం 'మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్' (వీతీ. ఔశీతీని ఖీతీశీఎ నశీఎవ). ఈ చిత్రం మే 15న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదలయ్యేందుకు ముస్తాబైంది. మధుదీప్ చెలికాని రచన, దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని అరవింద్ మండ్యం లోటస్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్‌పై నిర్మించారు. బాబ్జీ సమర్పిస్తున్నారు. చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా గురువారం హైదరాబాద్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ పాయల్ రాధాకృష్ణ మాట్లాడుతూ.. "ఆదిత్ (త్రిగుణ్) ఈ సినిమా గురించి చెప్పినప్పుడు చాలా హ్యాపీగా ఫీలయ్యాను. ఈ ఇయర్‌లో ఆల్రెడీ నేను నటించిన 'పాపం ప్రతాప్' రిలీజ్ అయింది.. ఇప్పుడు 'మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్' రిలీజ్ అవుతుంది. మరో ప్రాజెక్ట్ రెడీ అవుతోంది.. ఫ్రాన్స్‌లో షూట్ చేశాం.. జూలైలో రిలీజ్ కావచ్చు. ఒకే ఇయర్‌లో ఇన్ని రిలీజెస్ ఉండటం అనేది నాకు చాలా హ్యాపీగా ఉంది. నేను తెలుగు నేర్చుకునేటప్పుడు డబ్బింగ్ కోసం నేర్చుకున్నాను. సార్ చెప్పినట్టు.. ఈ సినిమా స్టార్ట్ చేసినప్పుడు నాకసలు తెలుగు తెలీదు. కానీ, ఇప్పుడు తెలుగు పర్సనల్‌గా మారింది. అదే లవ్‌లో ఇప్పుడు హైదరాబాద్‌లోనే



ఉన్నంత ఫీల్ నాకు ఎక్కడా రాదు. ఐ జస్ట్ వాంట్ టు స్టే హియర్. ఒకే ఇయర్‌లో ఇన్ని తెలుగు ఫిల్మ్స్ చేస్తూ ఉంటే.. ఇలాగే కంటిన్యూ అవ్వాలి, మీ అందరి సపోర్ట్ అండ్ బ్లెస్సింగ్స్ కావాలి. భవిష్యత్తులో ఇక్కడే ఉండిపోతానేమో.. తెలియదన్నారు.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**